# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 203 | గురువారం 7 మార్చి 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# డిజిటల్ వ్యవసాయం



- 'రైతు నేస్తం' ప్రారంభించిన సీఎం రేవంత్
- మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించిన సీఎం
- 3 సంవత్సరాల్లో 2601 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ల స్థాపన. రూ.97 కోట్లతో ప్రాజెక్టు అమలే లక్ష్యం
- మొదటి దశలో 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటుకు రూ. 4.07 కోట్లు ప్రభుత్వం విడుదల
- వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు చేదోడు వాదోడుగా డిజిటల్ ఫ్లాట్ ఫారం
- వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో క్షేత్రస్థాయిలో సమస్యలపై రైతులతో చర్చలు

హైదరాబాద్

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అను సంధానం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించే వినూత్న కార్యక్రమం రైతు నేస్తం. 3 సంవత్సరాల్లో 2601 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ల స్థాపన. రూ.97 కోట్లతో ప్రాజెక్టు అమలే లక్ష్యంగా, మొదటి దశలో 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటుకు రూ. 4.07 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు చేదోడు వాదోడుగా డిజిటల్ ఫ్లాట్ ఫారం ఉండనుంది. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో క్షేత్రస్థాయిలో సమస్యలపై రైతులతో చర్చించ నున్నారు. గ్రామాల నుంచే రైతులు -మిగతా3లో

## తొలి విడతలో సొంత స్థలం ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్లు

- నిరుపేదలకు నిలువ నీడను కల్పించడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం
- ఆరు గ్యారంటీలలో ఇప్పటికే నాలుగు గ్యారెంటీలను అమలు చేశాం
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇల్లు లేని వారికి ఇంటి స్థలం
- స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల సహాయం అందించడానికి కార్యచరణ



హైదరాబాద్

ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీలలో ఇప్పటికే నాలుగు గ్యారెంటీలను అమలు చేశాం. ఈ నెల 11న భద్రాచలం రాములోని సన్నిధిలో ఐదవ గ్యారంటీ ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నిరుపేదలకు నిలువ నీడను కల్పించడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్య మన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇల్లు -మిగతా3లో

## కేసీఆర్ పాలనలో తెలంగాణ సర్వనాశనం



- రేవంత్ రెడ్డిని ఎదుర్కొనే దమ్ములేకే కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు: మంత్రి కోమటిరెడ్డి
- కేసీఆర్ ప్రభుత్వ పాలనకు, రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనకు నక్కకు... నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని వ్యాఖ్య
- పార్లమెంట్ ఎన్నికల తర్వాత హరీశ్ రావు బీజేపీలోకి వెళ్లే అవకాశముందన్న కోమటిరెడ్డి
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాదని జోస్యం
- కేసీఆర్‌కు దిక్కులేక ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కాళ్లు పట్టుకునే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా

నల్గొండ

కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎదుర్కొనే దమ్ములేకే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని మంత్రి కోమటిరెడ్డి వెంక టరెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన నల్గొండలో మీడియాతో మాట్లా డారు. కేసీఆర్ ప్రభుత్వ పాలనకు, రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనకు నక్కకు... నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత హరీశ్ రావు ఆ పార్టీలో ఉండటం అనుమానంగానే ఉందని... బీజేపీలోకి వెళ్లే అవకాశముందని జోస్యం చెప్పారు. బీజేపీతో ఇప్పటికే సంప్రదింపులు జరుపుతున్నట్లుగా తెలుస్తోందని -మిగతా3లో



## షాజహాన్‌ను సీబీఐకి అప్పగించాల్సిందే

- టీఎంసీ నేత షాజహాన్ షేక్‌ను కస్టడీకి అప్పగించే విషయంలో బెంగాల్ ప్రభుత్వం, సీబీఐ మధ్య రసవత్తర రాజీకీయం
- షాజహాన్‌ను సీబీఐకి అప్పగించేందుకు బెంగాల్ పోలీసులకు కలకత్తా హైకోర్టు కొత్త డెడ్‌లైన్
- సీఐడీపై కోర్టు ధిక్కారం నమోదు చేయాలని సీబీఐ కోరిన నేపథ్యంలో హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీ

# తుదిదశకు కాంగ్రెస్ జాబితా

- నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి
- లోక్‌సభ అభ్యర్థుల జాబితాపై చర్చ
- నేడు కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సమావేశానికి హాజరు కానున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నేడు తొలి జాబితా విడుదల చేసే అవకాశం
- రాష్ట్రంలోని పరిస్థితులను ఢిల్లీ పెద్దలకు వివరించనున్న రేవంత్ రెడ్డి



హైదరాబాద్

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల వేడి రాజుకుంటోంది. ఎన్నికలకు సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలన్నీ వేగం పెంచాయి. అభ్యర్థుల ప్రకటన, బహిరంగ సమావేశాలతో ఎన్నికల కదనరంగంలోకి దూకేందుకు రెడీ అవుతున్నాయి. తెలంగాణలో 17కి 17 సీట్లు గెలుస్తామని ఢంకా బజాయిస్తున్న కాంగ్రెస్, గెలుపు గుర్రాలను రంగంలోకి దించే కసరత్తును చివరిదశను తీసుకొచ్చింది. చాలా సెగ్మెంట్లలో ఇప్పటికే అభ్యర్థులు షార్ట్‌లిస్ట్ అయ్యారు. రేపు ఢిల్లీలో కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ భేటీ అవుతోంది. తొలి జాబితాలో తెలంగాణ సీట్లను కాంగ్రెస్ ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణపై కాంగ్రెస్ ఫోకస్ చేస్తోంది. మహబూబ్‌నగర్ -మిగతా3లో

## ప్రధాని బిహార్ పర్యటన.. 'ఆ ధైర్యం మోదీకి ఉందా?'



- మోదీ ప్రభుత్వం ఎందుకు సాధారణ జనాభా గణను నిర్వహించడం లేదు?
- 2011లో నిర్వహించిన సామాజిక ఆర్థిక కుల గణనలో సేకరించిన కుల సంబంధిత డేటాను మోదీ ప్రభుత్వం ఎందుకు విడుదల
- సామాజిక -ఆర్థిక సమస్యపై కూడా ఆయన ధైర్యంగా మాట్లాడతా..



## తెలంగాణకు అమిత్‌షా.. భారీ సభకు బీజేపీ ప్లాన్

- కేంద్రమంత్రులు, బీజేపీ అగ్ర నేతలు తెలంగాణపై ఫుల్ ఫోకస్
- తెలంగాణలో మెజార్టీ లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ భారీ వ్యూహరచన
- ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం

ఢిల్లీ/హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్రమంత్రులు, బీజేపీ అగ్ర నేతలు తెలంగాణపై ఫుల్ ఫోకస్ పెట్టారు. ఈ క్రమంలోనే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణలో పర్యటించనున్నారు. దీంతో, రాష్ట్రంలో రాజకీయంగా మరోసారి ఆసక్తికరంగా మారింది. వివరాల ప్రకారం.. తెలంగాణలో మెజార్టీ లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ భారీ వ్యూహరచన చేస్తోంది. ఇందులో భాగంగానే ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఇక, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా తెలంగాణకు రానున్నారు. ఈనెల 12వ తేదీన అమిత్ షా తెలంగాణలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులు, ఆపై స్థాయి కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ శ్రేణులు నగరంలోని ఎల్బీ స్టేడియంలో భారీ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# షాజహాన్‌ను సీబీఐకి అప్పగించాల్సిందే

పశ్చిమ బెంగాల్‌లోని 'సందేశ్‌ఖాలీ' అరాచకాల కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడైన సస్పెండెడ్ టీఎంసీ నేత షాజహాన్ షేక్‌ను కస్టడీకి అప్పగించే విషయంలో బెంగాల్ ప్రభుత్వం, సీబీఐ మధ్య రసవత్తర రాజకీయం నడుస్తోంది. తాజాగా. షాజహాన్‌ను సీబీఐకి అప్పగించేందుకు బెంగాల్ పోలీసులకు కలకత్తా హైకోర్టు కొత్త డెడ్‌లైన్ విధించింది సందేశ్‌ఖాలీ కేసుపై జస్టిస్‌లను హరీష్ టండన్, హిరన్మయి భట్టాచర్యాలతో కూడా ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా షాజహాన్‌ను నేటి సాయంత్రం 4.15 నిమిషాల వరకు సీబీఐకి అప్పగించాల్సిందేనని ఆదేశించింది. సీఐడీపై కోర్టు ధిక్కారం నమోదు చేయాలని సీబీఐ కోరిన నేపథ్యంలో హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కోర్టు ఇచ్చిన గడువు ముగియడంతో సీబీఐ అధికారులు బెంగాల్ పోలీసు హెడ్‌క్వార్టర్‌కు చేరుకున్నారు. అయితే ఈ కేసులో షాజహాన్ షేక్‌ను సీబీఐకి అప్పగించాలంటూ కలకత్తా హైకోర్టు మంగళవారమే ఆదేశాలు ఇచ్చింది. కానీ దీనిని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం లెక్కచేయలేదు. అతడిని అప్పగించబోమని తెలిపింది. ఈ మేరకు హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు సీబీఐ అధికారులు కోల్‌కతాలోని సీఐడీ ప్రధాన కార్యాలయానికి వెళ్లగా.. షాజహాన్‌ను అప్పగించేందుకు పోలీసులు నిరాకరించారు. దీంతో సీబీఐ అధికారులు అక్కడి నుంచి వెనక్కి వెళ్లిపోయారు.

అనంతరం సీబీఐ మరోసారి హైకోర్టును ఆశ్రయించింది. మంగళవారం నాటి ఆదేశాలపై సుప్రీం ఎటువంటి స్టే



ఇవ్వలేదని.. అయినా రాష్ట్ర ప్రభుత్వం షాజహాన్ షేక్‌ను అప్పగించడం లేదని ఈడీ చెప్పడంతో నేటి సాయంత్రానికి నిందితుడు షాజహాన్ షేక్‌ను అప్పగించి తీరాల్సిందేనని హైకోర్టు డెడ్‌లైన్ విధించింది. కాగా గత కొంతకాలంగా సందేశ్‌ఖాలీ పేరు వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. టీఎంసీ నేత షాజహాన్ షేక్ ఇంట్లో సోదాలు చేసేందుకు వెళ్లిన ఈడీ అధికారులపై అతడి అనుచరులు దాడి చేశారు. అనంతరం అతడు స్థానికుల నుంచి భూములు లాక్కోవడం, ఇవ్వని పక్షంలో మహిళలపై లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆకృత్యాలపై, టీఎంసీ గుండాలకు వ్యతిరేకంగా అక్కడి మహిళలు రోడ్డెక్కారు. ఈ ఉద్యమానికి బీజేపీతో సహా ప్రతిపక్షాలు మద్దతు ఇచ్చాయి. ఈ నేపథ్యంలో జనవరి 5 నుంచి షేక్ షాజహాన్ పరారీలో ఉన్నాడు. దాదాపు 55 రోజుల తర్వాత గవర్నర్, హైకోర్టు అల్టిమేటంతో బెంగాల్ పోలీసులు ఇతడిని అరెస్ట్ చేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వమే షాజహాన్‌ని కాపాడుతోందని బీజేపీ విమర్శిస్తోంది. ఈ వివాదం పెద్దది కావడంతో టీఎంసీ అతడిని 6 ఏళ్ల పాటు సస్పెండ్ చేసింది. ఇతడికి బెయిల్ ఇచ్చేందుకు కూడా హైకోర్టు నిరాకరిస్తూ.. అతడిపై తమక సానుభూతి లేదని ప్రకటించింది.

# డబుల్ జీరో! కాంగ్రెస్ 'సున్నా' రాత మారేనా?

రాజస్థాన్‌లో లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతలు ఢిల్లీలోని బిహార్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అఖిలేష్ ప్రసాద్ సింగ్ నివాసంలో స్క్రీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 25 స్థానాలకు గానూ 24 స్థానాలను బీజేపీ గెలుచుకుంది. రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ ఒక స్థానంలో విజయం సాధించింది. రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయినా రాష్ట్రంలో 34.6 శాతం ఓట్లు సాధించింది. సమావేశం అనంతరం కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ మాట్లాడుతూ.. మార్చి 7న కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం జరగనుందని చెప్పారు. అభ్యర్థుల పేర్లను ఖరారు చేసే ప్రక్రియలో ఉన్నా?మని, అతి త్వరలోనే పేర్లను ప్రకటిస్తామని వెల్లడించారు. కాగా గెలుపు గుర్రాలను గుర్తించినట్లు కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ అఖిలేష్ ప్రసాద్ సింగ్ తెలిపారు. రాజస్థాన్‌లో పొత్తుల భాగస్వామ్య పక్షాలతో సీట్ల పంపకంపై మాట్లాడుతూ.. "రాజస్థాన్‌లో పొత్తు ఎవరితో, ఎలా ఉండాలో నిర్ణయించే ఇండియా కూటమితో పాటు మాకు ఏఐసీసీ కమిటీ ఉంది" అన్నారు.

**2019లో ఎన్‌డీఏ క్లీన్‌స్వీప్**

2019 లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. మొత్తం 25 స్థానాలకు గానూ 24 స్థానాలను బీజేపీ గెలుచుకుంది. రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ ఒక స్థానంలో విజయం సాధించింది. ఈ పార్టీ కూడా ఎన్‌డీఏలో భాగస్వామి కావడం




విశేషం. అంటే అన్ని స్థానాలను ఎన్‌డీఏ కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. ఈ ఎన్నికల్లో బీజేపీ 59 శాతం ఓట్లు సాధించింది. రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేక పోయినా రాష్ట్రంలో 34.6 శాతం ఓట్లను సాధించగలిగింది. కాగా 2018లో రెండు లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది.

**2014లో 'జీరో' సీట్లు**

అంతకు ముందు 2014 సార్వత్రికలో ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ రాజస్థాన్ లోక్‌సభ స్థానాల్లో ఖాతా తెరవలేకపోయింది. అప్పుడు కూడా ఎన్‌డీఏ క్లీన్‌స్వీప్ చేసింది. మొత్తం 25 సీట్లలో 21 స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. 55.6 శాతం ఓట్లు సాధించింది. ఇక ఖాతా తెరవలేకపోయిన కాంగ్రెస్ 30.7 శాతం ఓట్లు తెచ్చుకుంది. 2019 ఎన్నికలను పరిశీలిస్తే 47 శాతం ఓట్లతో 20 సీట్లు గెలుపొందగా, బీజేపీ 36.6 శాతం ఓట్లతో కేవలం 4 స్థానాలే గెలిచింది. మరి ఈసారైనా కాంగ్రెస్ 'సున్నా' రాత మారుతుందో లేదో చూడాలి.

# రూ.12,000 కోట్ల విలువైన మానవ వెంట్రుకల అక్రమ రవాణా

మానవ శిరోజాల అక్రమ రవాణా... మీరు చదివింది నిజమే... మీరు హెయిర్ కట్ చేసుకున్న తర్వాత మీ హెయిర్ ఏమవుతుందో మీకు తెలుసా? విదేశాల్లో భారతీయుల వెంట్రుకలకు భలే డిమాండ్ ఉంది. దీంతో వెంట్రుకల అక్రమ రవాణా జరుగుతోంది. మన దేశం నుంచి మానవ వెంట్రుకలను కొనుగోలు చేసే దేశాల్లో చైనా ముందు స్థానంలో ఉంది. తాజాగా ఈడీ అధికారులు తెలంగాణలో రూ.11,793 కోట్ల మానవ వెంట్రుకల అక్రమ రవాణా రాకెట్‌ను ఛేదించారు. చైనాతో పాటు మయన్మార్, బంగ్లాదేశ్, వియత్నాం వంటి దేశాలకు భారతదేశ సరిహద్దుల మీదుగా మానవ వెంట్రుకలను అక్రమంగా తరలించిన కేసును ఈడీ విచారిస్తోంది. ఈ మానవ వెంట్రుకలను హైదరాబాద్ విమానాశ్రయంతో పాటు ఇతర ప్రాంతాల మీదుగా అక్రమంగా తరలిస్తున్నట్లుగా గుర్తించారు. మానవ వెంట్రుకల



అక్రమ రవాణాకు సంబంధించి 2021లోనే హైదరాబాద్‌కు చెందిన నైలా ఫ్యామిలీ ఎక్స్‌పోర్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్ పాత్రను గుర్తించి అధికారులు చర్యలు తీసుకున్నారు. వీరు బినామీ ఇంపోర్ట్-ఎక్స్‌పోర్ట్ కోడ్‌లను ఉపయోగించినట్లు గుర్తించారు. హైదరాబాద్, మిజోరాం, మయన్మార్‌ల ద్వారా మనీ లాండరింగ్ కార్యకలాపాలు నిర్వహించినట్లుగా గుర్తిం చారు. చైనాలో బట్టతల అక్కడి వారికి సమస్యగా మారింది. దీంతో విగ్గుల తయారీ, అమ్మకాలు అక్కడ ఎక్కువ. ఈ నేపథ్యంలో ఇక్కడి మానవ శిరోజాలకు డిమాండ్ ఏర్పడి అక్రమ రవాణా జరుగుతోంది. ఫిబ్రవరి 2022లో ఈడీ దేశవ్యాప్తంగా సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో మయన్మార్‌కు వెంట్రుకల తరలింపును గుర్తించారు. మానవ వెంట్రుకలను విదేశాలకు తరలించేందుకు నైలా కంపెనీ పలు షెల్ కంపెనీలను ఏర్పాటు చేసిందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. నివేదిక ప్రకారం మానవ వెంట్రుకల అక్రమ రవాణా ద్వారా ప్రతి ఏటా దాదాపు రూ.8వేల కోట్లు హవాలా మార్గంలో అందుతున్నట్లుగా తేలింది.

# మా ఇంట్లోనూ బోరుబావి ఎండిపోయింది

**బెంగళూరు:** కర్ణాటక రాజధాని బెంగళూరును నీటి సంక్షోభం వేధిస్తోంది. వేసవికాలం ప్రారంభంలోనే నీటి కొరత నగర వాసులకు చుక్కలు చూపిస్తోంది. దాదాపు అన్ని ప్రాంతాల్లో నీటి సమస్యతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కుళాయిలు, బోర్ల నుంచి నీరు రాకపోవడంతో ట్యాంకర్ల నుంచి నీటిని సరఫరా చేసుకుంటున్నారు. తాజాగా బెంగళూరులో నీటి ఎద్దడిపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. నగరంలో రోజురోజుకీ నీటి కొరత తీవ్రతర అవుతుందని, దాదాపు 3000 పైగా బోరు బావులు ఎండిపోయాయని తెలిపారు.తన ఇంటి వద్ద ఉన్న బోరు బావి కూడా ఎండిపోయిందని తెలిపారు. నీటి సమస్యను తీర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని చెప్పారు. సంబంధిత అధికారులతో ఇప్పటికే చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాలను గుర్తించి, ట్యాంకర్ల ద్వారా సరాఫరా చేస్తామని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నీటి సరఫరా జరిగేలా చూస్తామని తెలిపారు. నగరంలో నీటి కొరతకను తీర్చలేని పరిస్థితులకు కేంద్రంలోనీ బీజేపీ కూడా కారణమేనంటూ శివకుమార్ విమర్శించారు. బెంగుళురుకు మంచి నీటిని అందించాలనే ఉద్దేశంతో మేకేదాటు ప్రాజెక్టుకు తాము శ్రీకారం చుట్టామని అన్నారు. ప్రాజెక్టుకు ఆమోదం తెలపాలని పాదయాత్ర చేసినా.. కేంద్రం పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుత సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకొని అయినా ఈ ప్రాజెక్టు అనుమతులు ఇస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. కరవు పరిస్థితులతో తాగునీటి కొరత గ్రామాలనే కాకుండా, సిలికాన్ సిటీలో, అందులోనూ సీఎం అధికార నివాసం కృష్ణను కూడా పీడిస్తోంది.



నగరంలో తాగునీటి సరఫరా అరకొరగా ఉంది. దీంతో సీఎం నివాసానికి జలమండలి కొళాయిల నుంచి నీరు రావడం లేదు. అధికారులు హడావుడిగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మార్చి మొదటి వారమే ఇలా ఉంటే ఏప్రిల్, మే మాసాల్లో నీటి ఎద్దడి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో హైదరాబాద్ వాసి మృతి



రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలై.. రెండు సంవత్సరాలు అవుతోంది. తొలుత ఉక్రెయిన్‌పై భీకర దాడులు చేసి రష్యా ఆధిపత్యం చెలాయించగా.. ఆ తర్వాత ఉక్రెయిన్ పాశ్చాత్య దేశాల సహకారంతో ఎదురుదాడుల్ని పెంచింది. మొదట్లో రష్యా ఆక్రమించిన ఉక్రెయిన్ భూభాగాల్ని ఒక్కొక్కటిగా తిరిగి స్వాధీనం చేసుకుంటోంది. దీంతో రష్యా తన దాడుల్ని మరింత తీవ్రతరం చేసింది. ఉక్రెయిన్‌ని బలహీనపరిచేందుకు ప్రధాన కార్యాలయాలను టార్గెట్ చేసుకొని, డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. ఇటు ఉక్రెయిన్ సైతం ఈ దాడుల్ని తిప్పికొడుతోంది. తాజాగా రష్యా- ఉక్రెయిన్ పోరులో హైదరాబాద్ వాసి మృతి చెందాడు.. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో రష్యా తరపున పోరాడుతూ నగరానికి చెందిన మహ్మద్ అఫ్సాన్(30) అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని అధికారులు బుధవారం వెల్లడించారు. అయితే ఉద్యోగం విషయంలో మోసపోవడంతో ఆఫ్సాన్ రష్యన్ ఆర్మీలో బలవంతంగా చేరాల్సి వచ్చినట్లు సమాచారం. కాగా రష్యా సైన్యానికి సహాయక సిబ్బందిగా పనిచేస్తున్న దాదాపు 20 మంది భారతీయులను తీసుకొచ్చేందుకు తాము ప్రయత్నిస్తున్నట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపిన కొద్ది రోజులకే ఈ విషాదం వెలుగుచూసింది. మరోవైపు మహ్మద్ అస్ఫాన్‌ను రష్యా నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు సాయం కోసం అతడి కుటుంబం ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీని సంప్రదించింది. ఈ క్రమంలో ఎంఐఎం మాస్కోలోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించగా.. అస్ఫాన్ మరణించినట్లు అక్కడి అధికారులు ధృవీకరించారు. మృతిడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## బాలుడి అవయవాలు దానం..

## అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



ఒడిశాలో బ్రెయిన్ డెడ్‌తో మరణించిన ఎనిమిదేళ్ల బాలుడి అవయవాలను అతని తల్లిదండ్రులు దానం చేశారు. బాలుడి మృతదేహాన్ని ఒడిశా ప్రభుత్వం సోమవారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించింది. భువనేశ్వర్‌కుచెందిన శుభజిత్ సాహు రెండో తరగతి చదువుతున్నారు. ఇటీవల పరీక్షకు హాజరవుతుండగా మూర్ఛతో కళ్లు తిరిగి పడిపోయాడు. వెంటనే అతడిని ఆసుపత్రిలో చేర్చగా.. కోమాలోకి వెళ్లిన్నట్లు వైద్యులు వెల్లడించారు. క్రమంగా అతడి మెదడు పనిచేయడం మానేసింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. దీంతో అతడి తల్లిదండ్రులు బాలుని అవయవాలు దానం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వాసుపత్రి వైద్యులకు లిఖిత పూర్వకంగా తెలియజేశారు. బాలుడిమూత్ర పిండాలు, ఇతర అవయవాలను శస్త్రచికిత్స ద్వారా తొలగించి భద్రపరిచి పార్థివ దేహాన్ని వారికి అప్పగించారు. అవయవ దానం చేసిన వారికి ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు చేయించింది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం జంట నగరాల పోలీస్ కమిషనర్ సంజీవ్ పండా, ఇతర అధికారుల సమక్షంలో సత్యనగర్ రుద్రభూమిలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

## ప్రధాని బిహార్ పర్యటన.. 'ఆ ధైర్యం మోదీకి ఉందా?'




భారత ప్రధాని నరేంద్ర మోదీ బిహార్‌లో పర్యటిస్తున్నారు. ఈ రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభిస్తున్నారు. ఈ క్రమంలో మోదీపై విపక్ష కాంగ్రెస్ పార్టీ మాటల దాడిని ప్రారంభించింది. బిహార్‌లో పర్యటిస్తున్న ప్రధాని మోదీ అక్కడి కుల ఆధారిత జనాభా గణన గురించి మాట్లాడే ధైర్యం చేస్తారా అని సవాలు విసురుతోంది. ఈ మేరకు కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జైరాం రమేష్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ట్విటర్)లో ఒక పోస్టు చేశారు. 'ఆయన (మోదీ) అక్కడ కూడా అపద్ధాలు, ప్రకటన వర్షం కురిపిస్తాడు. వీటితోపాటు కుల జనాభా గణన అనే ముఖ్యమైన సామాజిక -ఆర్థిక సమస్యపై కూడా ఆయన ధైర్యంగా మాట్లాడతాడని ఆశిస్తున్నాం' అంటూ హిందీలో రాసుకొచ్చారు.

అలాగే ఈ పోస్టులో ఆయన ప్రధాని నరేంద్ర మోదీకి నాలుగు ప్రశ్నలను సంధించారు. మోదీ ప్రభుత్వం ఎందుకు సాధారణ జనాభా గణను నిర్వహించడం లేదు? 2011లో నిర్వహించిన సామాజిక ఆర్థిక కుల గణనలో సేకరించిన కుల సంబంధిత డేటాను మోదీ ప్రభుత్వం ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. 'బిహార్‌లో 'ఇండియా' సంకీర్ణ ప్రభుత్వం కుల గణనను చేపట్టి గణాంకాలను విడుదల చేసింది. జనాభా గణనలో వెల్లడైన వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక న్యాయం కోసం ఇప్పుడు బిహార్‌లోని 'కొత్త' ఎన్‌డీఏ ప్రభుత్వం విజన్ ఏమిటి? దేశవ్యాప్త సామాజిక-ఆర్థిక కుల గణనకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది. ఈ అంశం బీజేపీ స్టాండ్ ఏమిటి?' అని జైరాం రమేష్ ప్రశ్నించారు.

## మోదీ కా పరివార్' పేరుతో పోస్టర్ల కలకలం..

## పలువురిపై ఎఫ్ఐఆర్ నమోదు



సెంట్రల్ ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ప్రధాని మోదీని కించపరుస్తూ 'మోదీ కా అస్లీ పరివార్' క్యాప్షన్ జోడిస్తూ పలువురు ఫోటోలతో కూడిన పోస్టర్లు ప్రత్యక్షమయ్యాయి. ఈ పోస్టర్లపై సమాచారం అందుకున్న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ సందర్భంగా.. తుగ్లక్ రోడ్ పోలీస్ స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులపై ఢిల్లీ ప్రివెన్షన్ ఆఫ్ డిఫేస్‌మెంట్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, పోస్టర్లను తొలగించినట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అయితే, ఆ పోస్టర్లలో పబ్లిషర్ పేరు, వాటిని ఎవరు విడుదల చేశారో తెలియాల్సి ఉందని అన్నారు.

**140 కోట్ల మంది భారతీయులు నా కుటుంబమే**

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బిహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ 'జన విశ్వాస యాత్ర' చేపట్టారు. ఆ యాత్రలో ఆయన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్ ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ప్రధానికి కుటుంబం లేదని అన్నారు. లాలూ చేసిన వ్యాఖ్యలకు ప్రధాని మోదీ దీటుగా బదులిచ్చారు. 140 కోట్ల మంది భారతీయులు నా కుటంబమే అని వ్యాఖ్యానించారు.

**'మోదీ కా పరివార్'**

లాలుప్రసాద్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ బీజేపీ అగ్రనేతలు స్పందించారు. ఎక్స్. కామ్ వేదికగా ఆ పార్టీ అగ్ర నేతలు తమ పేరు పక్కన 'మోదీ కా పరివార్' అని పెట్టుకున్నారు.

# తుదిదశకు కాంగ్రెస్ జాబితా

-మొదటి పేజి తరువాయి

సీటుకు కాంగ్రెస్ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డి పేరును ఇప్పటికే అఓ రేవంత్ ప్రకటించారు. మిగతా సీట్లపై మాత్రం హైకమాండ్ ప్రకటన చేస్తుందని చెబుతున్నారు. ఒకవైపు తెలంగాణ నుంచి బరిలోకి దిగాల్సిందిగా రాహుల్‌గాంధీని కాంగ్రెస్ నేతలు కోరారు. కేరళలోని వాయనాడ్‌లో అఖఎ ఈసారి కూడా తమ అభ్యర్థిని బరిలోకి దించడంతో, తెలంగాణ నుంచి ఆయన్ను బరిలోకి దించడానికి కాంగ్రెస్ నేతలు తమ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో 17 సీట్ల టార్గెట్‌ను చేరుకోవాలంటే పార్టీకి మరింత జోష్ కావాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇందుకోసమే రాహుల్‌గాంధీని పోటీకి దించేలా లాబీయింగ్ చేస్తున్నారు. ఇప్పటికే ఎంపీ అభ్యర్థిగా చల్లా వంశీచంద్ రెడ్డిని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి.. షెడ్యూల్ కంటే ముందే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే పార్లమెంట్ పరిధిలో పాలమూరు న్యాయ యాత్ర పేరుతో వంశీచంద్ రెడ్డి పర్యటన పూర్తి చేసుకున్నారు. ఈ యాత్ర ముగింపు సభకు ప్రజా దీవెన సభగా నామకరణం చేశారు. పాలమూరు ప్రజా దీవెన సభా వేదికగా జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి పలు వరాలు ప్రకటిస్తారని సమాచారం. విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తూ పలు విద్యాసంస్థల ఏర్పాటుకు సంబంధించిన ప్రకటన చేసే అవకాశం ఉంది. మహబూబ్ నగర్ జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గ ఉపఎన్నిక అభ్యర్థిని కూడా ప్రకటిస్తారని చెబుతున్నారు.

**నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి...**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు ఢిల్లీకి వెళ్లనున్నారు. త్వరలో



లోక్ సభ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రేపు ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ సమావేశం కానుంది. ఈ సమావేశానికి రేవంత్ రెడ్డి హాజరు కానున్నారు. తెలంగాణలోని 17 లోక్ సభ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక కసరత్తును పార్టీ అధిష్ఠానం రేపు పూర్తి చేయనుంది. స్క్రీనింగ్ కమిటీ సమావేశం అనంతరం రేపే 10 మందితో తొలి జాబితా విడుదల చేసే అవకాశముంది. ఆ తర్వాత ఒకటి రెండు రోజుల్లో దాదాపు మొత్తం అభ్యర్థులను ప్రకటించవచ్చు. అభ్యర్థుల ఎంపిక బాధ్యతను రేవంత్ రెడ్డికి పార్టీ అధిష్ఠానం అప్పగించింది. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో అభ్యర్థులను దాదాపు ఖరారు చేశారు. రేపు స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో అభ్యర్థులపై చర్చ జరగనుంది. రాష్ట్రంలోని పరిస్థితులను ఆయన ఢిల్లీ పెద్దలకు వివరించనున్నారు. రేపు కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా హాజరు కానున్నారు.

# బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ

**హైదరాబాద్ :** లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. తెలంగాణలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. బీఆర్‌ఎస్‌లో కింది స్థాయి నేతల నుంచి ఎంపీ టిక్కెట్ పొందగలిగే స్థాయి నేతల వరకూ రాత్రికి రాత్రే జంప్ చేస్తున్నారు. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీలో అన్ని పదవులు అనుభవించిన సీనియర్ నేతల్లో చాలామంది ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిపోగా, కాంగ్రెస్‌లో టికెట్ రాదనుకున్న మరికొందరు బీజేపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల కసరత్తును దాదాపుగా పూర్తి చేశాయి. కానీ బీఆర్‌ఎస్ మాత్రం.. ఒక వేళ టిక్కెట్ ఇస్తే ఉంటారా .. వెళ్లిపోతారా అన్న సందిగ్ధంలో పడింది. ప్రస్తుతం తెలంగాణలోని రాజకీయ పరిమామాలు బీఆర్‌ఎస్ పార్టీని కలవర పెడుతున్నాయి. నిన్నటి దాకా తన దర్శనం కోసం పడిగాపులు కాసిన నేతలంతా ఇప్పుడు వేరే పార్టీలో చేరిపోవటం, గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా దిక్కులు చూడటంతో కేసీఆర్ దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయారు. మరీ ముఖ్యంగా గత ఎన్నికల్లో హైదరబాద్ పరిధిలోని దాదాపు అన్ని సీట్లు గెలుచుకుని ఆధిక్యాన్ని ప్రదర్శించిన ఆ పార్టీకి నేడు లోక్‌సభ అభ్యర్థులు కరువవయ్యారు. అధికారంలో ఉండగా అన్నీ తానై వ్యవహరించిన కుమారుడు కేటీఆర్.. విపక్షంలోకి వచ్చిన రెండు నెలల్లోనే పార్టీని కాపాడుకోలేకపోవటం, హరీష్ రావు సైతం కేవలం తన జిల్లా రాజకీయాలకే పరిమితం కావటంతో కేసీఆర్ మళ్లీ రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది. లోక్‌సభ సీట్ల విషయానికొస్తే.. ఎంపీగా పోటీచేయాలంటే వంద కోట్లైనా ఖర్చు పెట్టక తప్పని పరిస్థితి ఉంది. దీంతో దీనికోసం పోటీపడే వ్యాపారవేత్తలు, సంపన్నులు తమ ప్రయోజనాలు నెరవేరాలని కోరుకోవటం సహజమే. అయితే.. పార్టీ ఓటమితో పాత నేతలెవరూ ఇప్పుడు ఎంపీ సీటు మాకొద్దంటే మాకొద్దని దూరంగా ఉంటున్నారు. గతంలో కేసీఆర్‌తో రాసుకుపూసుకు తిరిగి, పోటీకి ఉవ్విళ్లూరిన కొందరు సంపన్నులు సైతం మొహం చాటేయటం ఆ పార్టీని కలవరపరుస్తోంది. రాష్ట్రంలో అధికారం పోయిన సిట్టింగ్ సీట్లను నిలుపుకునేందుకు తంటాలు పడాల్సి వస్తోంది. సిట్టింగ్‌లలో ముగ్గురు వేరే పార్టీలోకి వెళ్లిపోయారు. వీరిలో నాగర్ కర్నూల్ ఎంపీ రాములు.. కుమారుడు భరత్‌కు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌కి బీజేపీ సీటు కూడా ఇచ్చేసింది. పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి పోటీ చేయలేనని చెప్పారన్న ప్రచారం జరుగుతోంది. మహబూబ్ నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి పూర్తిగా సైలెంట్ అయ్యారు. ఆయన బంధువులు కాంగ్రెస్ లో చేరిపోయారు. సిట్టింగ్ ఎంపీలే కాదు.. ఎంపీ స్థానానికి పోటీ చేసే స్థాయి ఉన్న నేతలు కూడా పార్టీ వీడిపోతున్నారు. హైదరాబాద్ మాజీ మేయర్



బొంతు రామ్మోహన్ దంపతులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సికింద్రాబాద్ సీటులో బొంతు శ్రీదేవి కాంగ్రెస్ నుంచి నిలిచే అవకాశముందనే వార్తలూ వినిపిస్తున్నాయి. మరోవైపు చెవెళ్ల పార్లమెంటు బరిలో ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి మహేందర్ రెడ్డి నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. అధికారంలో ఉన్నంత కాలం కేసీఆర్ ను పొగుడుతూ రాజకీయం చేసిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ సొంత సీటులో మారిన రాజకీయాలతో కేసీఆర్ పేరే ఎత్తటం లేదు. తెలగాణలో ముస్లింల ఓటు బ్యాంక్ చాలా కీలకం. మజ్లిస్ సహకరిస్తే.. నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ వంటి చోట్ల.. కాంగ్రెస్ పార్టీ .. డామినేట్ చేసే అవకాశం ఉంది. మజ్లిస్ పాలసీ ప్రకారం అధికార పార్టీకే అండగా ఉంటుంది. హైదరాబాద్ స్థానంలో మాత్రమే.. అసదుద్దీన్ నిలబడి.. మిగిలినచోట్ల కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉండే అవకాశం ఉంది. ఇదిబీఆర్‌ఎస్ బలాన్ని మరింత తగ్గించడమే అవుతుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 సీట్లలో కాంగ్రెస్ 4, బీజేపీ 4 గెలుచుకోగా, బీఆర్‌ఎస్ బలం 2 సీట్లకు పడిపోయింది. ఈ రెండు నెలల్లో అక్కడి అనేక గ్రామ, మండల, స్థానిక సంస్థల సభ్యులు కాంగ్రెస్‌లో చేరిపోవటంతో అక్కడ అభ్యర్థిగా నిలిచేందుకు ఎవరూ ముందుకు రావటం లేదు. నిజామాబాద్ సీటులో గతంలో పోటీ చేసిన కుమార్తె కవిత సైతం పోటీకి సిద్ధపడటం లేదు. మరెవరూ ఆ సీటు అడగడం లేదు. బండి సంజయ్ సిట్టింగ్‌గా ఉన్న కరీంనగర్ సీటు పరిధిలోని 7 అసెంబ్లీ సీట్లలో 4 కాంగ్రెస్, 3 బీఆర్‌ఎస్ గెలిచాయి. బిఆర్‌ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్‌కే చాన్సిచ్చారు. మెదక్ ఎంపీ సీటు పరిధిలోని 7 స్థానాల్లో కేవలం మెదక్ సీటు తప్ప అన్నీ బీఆర్‌ఎస్ గెలుచుకుంది. ఎలాంటి పరిస్థితిలోనూ బీఆర్‌ఎస్ గెలుస్తుందని అనుకుంటున్నా.. అభ్యర్తి విషయంలో మాత్రం పీట ముడిపడిపోయింది. జహీరాబాద్ ఎంపీ పరిధిలోని సెగ్మెంట్లలో 4 కాంగ్రెస్ చేతిలో, ఒకటి బీజేపీకి దక్కగా బీఆర్‌ఎస్ బాన్సువాడ, జహీరాబాద్ సీట్లకే పరిమితమైంది. దీంతో అక్కడా సీటు తీసుకునేందుకు ఎవరూ సాహసించటం లేదు. సిట్టింగ్ ఎంపీ బీజేపీ తరపున పోటీ చేస్తున్నారు. నల్గొండ, భువనగిరి, ఖమ్మం సీట్ల కోసం ఒక్క దరఖాస్తు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఉమ్మడి ఖమ్మం, నల్గొ?ండ జిల్లాల్లో గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఖమ్మం జిల్లాలో గెలిచిన ఒక్క ఎమ్మెల్యే కాంగ్రెస్ బాట పట్టటంతో అక్కడ నామా నాగేశ్వరరావుకే టిక్కెట్ ఖరారు చేశారు. కానీ ఆయన బీజేపీ తరపున పోటీ చేస్తారన్న ప్రచారం ఊపందుకుంటోంది. మహబూబ్ నగర్ సీటు, వరంగల్లు, మహబూబాబాద్‌లోనూ అదే పరిస్థితి. సికింద్రాబాద్ సీటు నుంచి తలసాని సాయిని బరిలో దించాలని పార్టీ భావిస్తున్నారు. ఈ ఎన్నికల్లో సత్తా చాటలేకపోతే.. మరో 5 ఏళ్ల నాటికి పార్టీ నామరూపాల్లేకుండా పోయేలా ఉందనేది ఎక్కువ మంది భావన. ఈ పరిస్థితి నుంచి కేసీఆర్ గట్టెక్కాల్సి ఉంది.

# ఏపీ బీజేపీ.. అంతా కన్ఫ్యూజన్

**విజయవాడ**

ఏపీలో ఒంటరిగా పోటీ చేయాలా..? లేకుంటే టీడీపీ-జనసేన కూటమితో పొత్తులతోనే ముందుకు వెళ్లాలా..? అనే దానిపై హైకమాండ్ తేల్చడం లేదు. ఇందుకోసమే ఏపీ బీజేపీ అభ్యర్థులను ప్రకటించలేదని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఈసారి ఎట్టి పరిస్థితుల్లో అటు పార్లమెంట్.. ఇటు అసెంబ్లీలో ఏపీ నుంచి నేతలు తప్పకుండా అడుగుపెట్టాల్సిందేనని హైకమాండ్ గట్టిగానే వ్యూహ రచన చేస్తోంది. బోణీ కొట్టాలన్నదే ప్రస్తుతం ఏపీ కమలనాథుల టార్గెట్ అంటున్నారు. ఇటీవల రాష్ట్ర నేతలతో హైకమాండ్ ప్రతినిధితో జరిగిన చర్చల్లో బీజేపీ పొత్తు అంశం హాట్ టాపిక్‌గా నిలిచింది. పొత్తుపై పార్టీ కీలక నేతల అభిప్రాయాలు, సలహాలు, సూచనలను సేకరిస్తున్నట్లు బీజేపీ మాజీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ వెల్లడించారు. దాంతో పాటుగా రాష్ట్రంలో పొత్తు పెట్టుకుంటే పరిస్థితి ఎలా ఉంటుంది? ఒంటరి పోరాటం చేస్తే ఎలా ఉంటుంది? అన్న అంశాలపై కూడా చర్చిస్తున్నామని, ఏది ఏమైనా పొత్తు విషయంలో తుది నిర్ణయం పార్టీ అధిష్టానం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ-జనసేన పొత్తు కూడా కుదుర్చుకున్నాయి. ఈ పొత్తులో తమతో పాటు బీజేపీ కూడా కలుస్తుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కానీ ఇదే పొత్తు అంశంలో ప్రస్తుతం ఏపీ బీజేపీలో తీవ్ర గందరగోళం నెలకొంది. కొందరు పొత్తుకు సుముఖత వ్యక్తం చేస్తుంటే మరికొందరు మాత్రం పొత్తు లేదు ఏమీ లేదు.. లోక్‌సభ సహా అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని పేర్కొంటున్నారు. విజయవాడలో ఏపీ బీజేపీ పురందేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కూడా పొత్తుపై భిన్నాభిప్రాయాలు వెలువడ్డాయి. ఇందులో పాల్గొన్న నేతల్లో కొందరు సమావేశంలో పొత్తుపై చర్చ జరిగిందంటే మరికొందరు మాత్రం పొత్తు ప్రస్తావనే రాలేదన్నారు. దీంతో రాష్ట్రంలో పొత్తు అంశంపై కమలం క్యాడర్‌లో కన్ఫ్యూజన్ వస్తోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న క్రమంలో బీజేపీ దూకుడు పెంచింది. దేశవ్యాప్తంగా అభ్యర్థుల్ని ఖరారు చేస్తున్నారు. ఏపీలో మాత్రం ఆ ప్రక్రియను చాలా రొటీన్ గా నిర్వహిస్తున్నారు. అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించిన తర్వాత నేతల అభిప్రాయాలు తెలుసుకున్నారు. పొత్తుల గురించి క్లారిటీ ఇవ్వకుండా ఒక్కో నియోజకవర్గానికి ముగ్గురు పేర్లు ఖరారు చేసి పంపాలని సూచించారు. ఇందులో భాగంగానే జిల్లాల ముఖ్యనేతలు, ఇన్‌ఛార్జ్‌లతో ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి సమావేశం నిర్వహించారు. హైకమాండ్ ప్రతినిధిగా శివప్రకాష్ వచ్చారు. ల పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి స్క్రీనింగ్ చేశారు. ఇప్పటికే ఎన్నికల కోర్ కమిటీ, త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదికల ఆధారంగా బీజేపీ జాతీయ నేతలు అభ్యర్థుల వడపోత చేస్తారు.

హైకమాండ్ చెప్పినట్లు నడుచుకుంటూ తాము రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, ఇందులో పార్టీ కార్యకర్తలంతా ఐకమత్యంతో పాల్గొంటారని ధీమా వ్యక్తం చేశారు. అన్ని పార్టీలు ఎన్నికలకు సిద్ధమయ్యాయి. బీజేపీ మాత్రం..ఎలాంటి ప్రిపరేషన్లు చేపట్టలేకపోయింది. ఇంత వరకూ కనీస ప్రచార ప్రణాళిక లేదు. ఒక్క బహిరంగసభ నిర్వహించలేదు. చిన్న చిన్న కార్యక్రమాలు ప్రెస్ మీట్లకే పరిమితమయ్యారు. దీనికి కారణం పొత్తులు ఖచ్చితంగా ఉంటాయన్న ఓ నమ్మకమే. అయితే కారణాలేమిటో కానీ.. అసలు అడుగు ముందుకు పడటం లేదు. మరో వారంలో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికిప్పుడు అన్ని స్థాయాల్లో పోటీ చేయడం కూడా సాధ్యం కాని విషయం.

## తెల్లం దిష్టిబొమ్మ దగ్ధం

**భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాచలంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్నటువంటి భద్రాచల ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్లో చేరుతారంటూ వస్తున్న ఊహ గానాలకు తెర పడింది. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భద్రాచల ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు దిష్టిబొమ్మ కాంగ్రెస్ శ్రేణులు దహనం చేసారు. గత పది సంవత్సరాలుగా పోదెం వీరయ్య అందరిని కలుపుకొని పోకపోవడం వల్లనే భద్రాచలం అభివృద్ధి ఆగిపోయింది అంటూ తెల్లం వెంకటరావు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తప్పు పడుతున్నారు.

## కేసీఆర్ పాలనలో తెలంగాణ సర్వనాశనం



-మొదటి పేజి తరువాయి

వ్యాఖ్యానించారు. పదేళ్ల కాలంలో తెలంగాణను కేసీఆర్ సర్వనాశనం చేశాడని ఆరోపించారు. కోట్లాది రూపాయల అప్పు చేసి రాష్ట్రాన్ని వందేళ్లు వెనక్కి నెట్టారని ధ్వజమెత్తారు. గతంలో బీఆర్ఎస్ తమ ఎమ్మెల్యేలను చేర్చుకున్నట్లుగా మేం కూడా ఇప్పుడు చేర్చుకుంటే ఆ పార్టీలో మిగిలేది నలుగురు మాత్రమేనని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఖాళీ అవుతోందని... లోక్ సభ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్కసీటు కూడా రాదని జోస్యం చెప్పారు. 14 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పాలన చూసి బీఆర్ఎస్ నేతలే అభినందిస్తున్నారని... లోక్ సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ శ్రేణులు మరింత శ్రమించాలని సూచించారు. రాహుల్ గాంధీ తెలంగాణ నుంచి పోటీ చేస్తే ప్రధాని నరేంద్ర మోదీ కంటే అధిక మెజార్టీ వస్తుందన్నారు. కేసీఆర్‌కు దిక్కులేక ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కాళ్లు పట్టుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని మంత్రి అన్నారు. ఉద్యోగులకు ఒకటవ తేదీనే వేతనాలు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రూప్-1, డీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చామని గుర్తు చేశారు. యాదగిరిగుట్ట దేవస్థానం నిర్మాణంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తామని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో మార్పులు చేర్పులు ఉంటాయని స్పష్టం చేశారు.

# డిజిటల్ వ్యవసాయం



-మొదటి పేజి తరువాయి

ఆన్‌లైన్‌లో తమ పంటలకు సంబంధించిన సలహాలు, సూచనలు అందుకోవటం. తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవటం. ప్రతి మంగళవారం, శుక్రవారం విస్తరణాధికారులు, రైతులతో రైతు నేస్తం కార్యక్రమం అమలవుతుంది. తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సహాయంతో రైతులకు పలు సూచనలు చేయనున్నారు. మొదటి దశలో 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం రూ. 4.07 కోట్లు విడుదల చేసింది ప్రభుత్వం. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, రైతులకు చేదోడు వాదోడుగా డిజిటల్ ఫ్లాట్ ఫారం ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో క్షేత్రస్థాయిలో సమస్యలపై రైతులతో చర్చలు జరపనున్నారు. గ్రామాల నుంచే రైతులు ఆన్‌లైన్‌లో తమ పంటలకు సంబంధించిన సలహాలు, సూచనలు అందుకోవటం, తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవటానికి అవకాశం ఉంటుంది. ప్రతి మంగళవారం, శుక్రవారం విస్తరణాధికారులు, రైతులతో రైతు నేస్తం కార్యక్రమం అమలవుతుంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సహకారంతో రాష్ట్ర వ్యవసాయశాఖ రైతులకు భరోసానిచ్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టింది.

## తొలి విడతలో సొంత స్థలం ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్లు



-మొదటి పేజి తరువాయి

లేని వారికి ఇంటి స్థలం, స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల సహాయం అందించడానికి అవసరమైన కార్యచరణను ప్రారంభించిందన్నారు. బుధవారం సచివాలయంలో హౌసింగ్ కార్పొరేషన్ అధికారులతో ఇందిరమ్మ ఇండ్లపై మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలి విడతగా ఈ సంవత్సరం ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్, జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పర్యవేక్షిస్తారని చెప్పారు. తొలి విడతలో సొంత స్థలం కలిగిన వారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షల రూపాయలు మంజూరు చేయనున్నామని, 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా ఇండ్లను నిర్మించాలని, హాలు, బెడ్ రూమ్ తో పాటు వంటగది, బాత్ రూమ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మహిళల పేరుపైన ఇండ్లను మంజూరు చేస్తామని, ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆహార భద్రత కార్డు ఆధారంగా లబ్దిదారుల ఎంపిక చేస్తారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంభందించిన మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలని అధికారులకు సూచించారు.

# మరో ఎమ్మెల్యే రెఢీ...



**హైదరాబాద్ :** పార్లమెంట్ ఎన్నికల వేళ తెలంగాణలో రాజకీయాలు వేగంగా మారిపోతున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ప్రజా ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డితో వరుస భేటీలు అవుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డితో చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య భేటీ అయ్యారు. సచివాలయంలో రేవంత్‌ను యాదయ్య కలిశారు. లోక్‌సభ ఎన్నికలకు ఈ వారంలో ఈసీ షెడ్యూల్ విడుదల చేయనుందనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో రేవంత్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యే యాదవ్ భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దీంతో త్వరలో యాదవ్ పార్టీ మారుతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రేవంత్‌ను కలవగా.. ఇప్పుడు మరో ఎమ్మెల్యే కలవడం గులాబీ వర్గాలను టెన్షన్ పెట్టిస్తుంది. కాలె యాదయ్య చేవెళ్ల నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. 2018 ముందస్తు ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ నుంచి కేవలం 268 ఓట్ల స్వల్ప మెజార్టీతో విజయం సాధించారు. గతంలో కాంగ్రెస్‌లో పనిచేయడంతో ఆ పార్టీ నేతలతో ఆయనకు సత్సంబంధాలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కూడా ఉండటంతో తిరిగి హస్తం గూటికి చేరాలని యాదయ్య భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే రేవంత్‌ను కలిసినట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్దంగా ఉన్నట్లు రేవంత్‌తో యాదయ్య చెప్పినట్లు టాక్ నడుస్తోంది. అన్నీ అనుకూలిస్తే త్వరలో ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దల సమక్షంలో యాదయ్య కండువా కప్పుకునే అవకాశా ముందని వార్తలొస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తెలంగాణలో అధికారంలో ఉండటంతో రాష్ట్రంలోని మెజార్టీ ఎంపీ సీట్లను గెలుచుకునేం దుకు వ్యూహాలు రచిస్తుంది. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు గాలం వేస్తోంది. కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఆ పార్టీలో చేరేందుకు నేతలు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఇటీవల రేవంత్‌ను కలవగా.. ఇప్పుడు యాదయ్య కలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వరుసపెట్టి రేవంత్‌ను కలుస్తుండటంతో.. పార్టీ మారేందుకేనని ప్రచారం జరుగుతోంది. కానీ సీఎంను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాత్రం బయటకు చెప్పడం లేదు. నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు కలుస్తున్నట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చెబుతూ వస్తున్నారు. రాష్ట్రంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వైపు చూస్తుండగా.. సిట్టింగ్ ఎంపీలు బీజేపీ వైపు చూస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలు కాషాయ పార్టీలో చేరారు. నాగర్ కర్నూలు ఎంపీ రాములు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ కమల తీర్థం పుచ్చుకోగా.. ఇటీవల బీజేపీ ప్రకటించిన తొలి జాబితాలో బీబీ పాటిల్‌కు అదే నియోజకవర్గం నుంచి సీటు కన్ఫామ్ అయింది. నాగర్‌కర్నూల్ నుంచి రాములు కుమారుడు భరత్‌కు బీజేపీ సీటు కేటాయించింది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని కాంగ్రెస్, బీజేపీ పదే పదే పదే వ్యాఖ్యానిస్తున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు వేరే దారి చూసుకుంటుండటంతో.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పరిస్థితి ఎలా ఉంటుందనే చర్చ నడుస్తోంది.

# కరీంనగర్ బరి నుంచి తీన్మార్



**కరీంనగర్ :** లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణలో మూడు ప్రధాన పార్టీలు సమాయత్తం అవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల జోష్‌ను లోక్‌సభ ఎన్నికల్లో కొనసాగించాలని కాంగ్రెస్ భావిస్తోంది. మరో జాతీయ పార్టీ బీజేపీ సిట్టింగ్ స్థానాలను డబుల్ చేసుకోవాలని చూస్తోంది. ఇక పదేళ్లు అధికారంలో ఉండి మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయిన బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలను నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే అభ్యర్థులను ప్రకటిస్తున్నాయి. బీజేపీ 9 మందిని ప్రకటించగా, బీఆర్ఎస్ 4 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. కాంగ్రెస్ ఇంకా కసరత్తు చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ సీటుపై అందరి దృష్టి పడింది. ఇక్కడి నుంచి ప్రస్తుతం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో బలమైన బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను ఓడించి చరిత్ర సృష్టించారు. వెలమ నేతను ఓడించిన బీసీగా గుర్తింపు తెచ్చుకున్నారు. నాడు కేసీఆర్ చేసిన హిందుగాడు, బొందుగాడు వ్యాఖ్యలు బండి సంజయ్ విజయంలో కీలకంగా మారాయి. నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేసిన పొన్నం ప్రభాకర్ మూడోస్థానానికి పరిమితమయ్యాడు. ఈ ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లోనూ కరీంనగర్ నుంచి బీజేపీ తరఫున సిట్టింగ్ ఎంపీ సంజయ్, బీఆర్ఎస్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్ పోటీ చేయడం ఖాయమైంది. ఈమేరకు రెండు పార్టీలు టిక్కెట్లు ప్రకటించాయి. ఇక ఈ ఇద్దరినీ ఢీకొట్టి గెలిచే నేతల కోసం కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. ఇక్కడి నుంచి వెలిచాల రాజేందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, పురుమళ్ల శ్రీనివాస్ టికెట్ ఆశిస్తున్నారు. అయితే ఈ ముగ్గురికీ బలమైన బండి సంజయ్‌ను ఢీకొట్టే సత్తా లేదు. దీంతో బలమైన అభ్యర్థి కోసం వేట సాగిస్తోంది. కరీంనగర్‌లో కాపు ఓటర్లు ఎక్కువ. ఈ సామాజికవర్గం ఓట్లు 3 లక్షల వరకు ఉంటాయని అంచనా. దీంతో కాంగ్రెస్ కాపు అస్త్రం ప్రయోగించాలని భావిస్తోంది. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరిన తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌ను బరిలో దించాలని భావిస్తోంది. బండి సంజయ్ మున్నూరు కాపు నేత. తీన్మార్ మల్లన్న కూడా కాపు సామాజికవర్గం నేత. దీంతో కాపుల ఓట్లు చీలుతాయని, మైనారిటీ ఓట్లు కాంగ్రెస్‌కే వస్తాయని హస్తం నేతలు భావిస్తున్నారు. తీన్మార్ మల్లన్నకు కరీంనగర్‌లో మంచి ఫాలోయింగ్ ఉంది. క్యూన్యూస్ ద్వారా ఆయన కరీంనగర్ ప్రజలకు దగ్గరయ్యాడు. ఇవి కూడా ఆయన ప్లస్ పాయింట్‌గా కాంగ్రెస్ బావిస్తోంది. తీన్మార్ మల్లన్న ప్రముఖ తెలుగు జర్నలిస్ట్. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2014 ఎన్నికల ఫలితాలకు ముందు తీన్మార్ మల్లన్న కేసీఆర్‌ను ఆయన ఫామ్‌హౌస్‌లో కలిసేందుకు అంగీకరించారు. అయితే తీన్మార్ మల్లన్నను పార్టీతో కలిసి పనిచేయాలని కేసీఆర్ కోరినప్పటికీ ఆయన ఆశించిన ఘనస్వాగతం లభించలేదు. దీంతో కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాడు. 2019లో హుజూర్‌నగర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా ఓడిపోయారు. 2019 గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పోటీ చేసి ఓడిపోయారు. 2021లో బీజేపీలో చేరారు. కానీ కొన్ని రోజులే కొనసాగారు. 2023 అసెంబ్లీ ఎన్నికల వేళ తీన్మార్ మల్లన్న కాంగ్రెస్‌లో చేరారు. తన క్యూన్యూస్‌లో కాంగ్రెస్ అనుకూలంగా ప్రచారం చేశారు.

## మతి స్థిమితం లేని యువకుడును ఆదరించిన అన్నం ఫౌండేషన్

**ఖమ్మం :** ఖమ్మం రైల్వే స్టేషన్లో మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్న యువకుడికి చికిత్స చేపించి కుటుంబ సభ్యులకు అన్నం ఫౌండేషన్ అప్పగించింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సహస్ర జిల్లా భగవాన్పూర్ కు చెందిన 20 ఏళ్ల రంజిత్ కుమార్ అనే యువకుడు ఖమ్మం రైల్వేస్టేషన్ లో బట్టలు లేకుండా తిరుగుతూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నరు. ఇటీవల అతన్ని రైల్వే ఎస్ఐ భాస్కర్ రావు ఆధ్వర్యంలో అన్నం సేవాశ్రమంలో చేర్పించారు. అక్కడ అన్నం శ్రీనివాస రావు ఆ యువకుడికి వైద్యం చేయించి ఆరోగ్యం కొంత మెరుగు అయిన తరువాత అతని వివరాలు తెలుసుకొని ఉత్తర్ ప్రదేశ్ లోని వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. ఉత్తర్ ప్రదేశ్ నుండి వచ్చిన బంధువులకు రైల్వే ఎస్ఐ సమక్షంలో రంజిత్ కుమార్ ను అన్నం శ్రీనివాసరావు వారికి అప్పగించారు. తమ సోదరుడిని కాపాడి వైద్యం చేపించి అప్పగించిన అన్నం ఫౌండేషన్ కు యువకుడి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

## మావోయిస్టులను తరిమికొడదాం

**భద్రాద్రి కొత్తగూడెం :** మాయదారి మావోయిస్టులను తరిమికొడదాం. ఆదివాసీ మహిళా అభివృద్ధికై పాటుబడుదామని ప్రజాస్వామ్య ఆదివాసీ సంఘం పేరిట ఒక లేఖ విడుదల అయింది. మావోయిస్టు చర నుండి మహిళా విముక్తికై పోరాడుదాం. మావోయిస్టు దళంలో మహిళలపై లింగ వివక్ష, హత్యాచారాల వ్యతిరేకంగా పోరాడుదాం. దళంలో మహిళలతో వంట పని, బ్యాగులు మోయించడం నాయకుల వ్యక్తిగత పనులు చేయించే బానిస సంకెళ్ల నుంచి విముక్తై పోరాడుదాం. మహిళా రిజర్వేషన్లు ఉపయోగించుకొని మనమే పాలకులు గా మారుదాం అంటూ లేఖలో పేర్కొన్నారు

## బీఆర్ఎస్ అందోళన

**కోదాడ :** రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బిఆర్ఎస్ నిరసన ధర్నాలలో భాగంగా కోదాడ పట్టణంలోని ఖమ్మం చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఫ్లకార్డులతో క్యాంపు కార్యాలయం నుండి ర్యాలీగా వచ్చి నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు..

## తహాశీల్దార్ కార్యాలయానికి తాళాలు

**జగిత్యాల :** జగిత్యాల జిల్లా ఎండపల్లి తహాశీల్దారు కార్యాలయానికి అద్దెకు ఇచ్చిన భవన యజమాని 3లక్షల 50వేల రూపాయల అద్దె బకాయిలు చెల్లించలేదని తాళం వేసిన భవన యజమాని రాయుళ్ల భూమేష్...కార్యాలయం ఏర్పాటు నుండి ఇప్పటివరకు మూడు లక్షల యాభై వేలు చెల్లించలేదని,కనీసం కార్యాలయ సామాగ్రి సమకూర్చిన ఎండపల్లి సర్పంచికి కూడా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని ప్రభుత్వం నుండి అద్దె బకాయలు మొత్తం చెల్లించేలా కృషి చేస్తానని ఎండపల్లికి చెందిన ఎంపిటిసి హామీ ఇవ్వడంతో భవన యజమాని రాయిళ్ల భూమెష్ కార్యాలయం తాళాలు ఇచ్చాడు.

## ఎల్ఆర్ఎస్ పై ధర్నా పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్ రావు

**జహీరాబాద్ :** ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చి ప్రజలను మోసం చేస్తోందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో ఎమ్మెల్యే మాణిక్ రావు పార్టీ శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఎన్నికల ముందు హస్తం పార్టీ ఇచ్చిన హామీ అమలు చేయాలని రుసుములు వసూలు చేయకుండా ఉచితంగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలను రుసుముల పేరిట దోచుకుంటే ఆందోళనలు తప్పవని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవోకు ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు.

## శివరాత్రి కి ముస్తాబయిన బీరంగూడ ఆలయం

**సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండలం బీరంగూడ లో శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ఘనంగా ముస్తాబయింది. , ఈ ఆలయానికి ప్రతి ఏటా శివరాత్రి ఉత్సవాలకు సుమారు 6, 7 లక్షల మంది భక్తులు హాజరవుతుంటారని ఈ సంవత్సరం ఇంకా ఎక్కువ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని, వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండ వివిధ ప్రాంతాల నుండి రవాణా సౌకర్యం, బోజన వసతి, మెడికల్ క్యాంపులు, చలవ పందిల్లు, మరుగుదొడ్లు, నీటి వసతుల వంటి సౌకర్యాలు ఆలయ ఈవో శశిధర్ రెడ్డి ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆలయం 6వ శతాబ్దంలో భృగు మహర్షి తన తపస్సు శక్తినంత ధారబోసి ఈ ఆలయం నిర్మించబడిందని, శ్రీశైలం మహా క్షేత్రాన్ని సందర్శించ స్తోమత లేని భక్తులు ఇక్కడికి వచ్చి పూజలు చేసుకొని అంతటి అనుభూతిని పొందువచ్చని, ఇక్కడి నుండి శ్రీశైలం క్షేత్రానికి ఒక సొరంగ మార్గం కూడా ఉన్నట్టు ఆనవాలు ఉన్నాయని ఆలయ ప్రధాన అర్చకులు ప్రహ్లాదశర్మ తెలిపారు.

## భర్త ఒక పార్టీ.. భార్య మరో పార్టీ

**విజయనగరం :** ఏపీ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఎన్నికల్లో టికెట్లు దక్కని నేతలు పక్క చూపులు చూస్తున్నారు. ముఖ్యంగా వైసీపీని పెద్ద ఎత్తున నేతలు వీడుతున్నారు. తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. అయితే ఓ ఎమ్మెల్సీ వైసీపీలో ఉండగా.. భార్య మాత్రం టిడిపిలో చేరారు . ఇదో హాట్ టాపిక్ గా మారింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. విజయనగరం జిల్లా శృంగవరపుకోట వైస్ ఎంపీపీ ఇందుకూరు సుధారాణి లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. ఆమె వెంట 150 మంది వైసీపీ కీలక నేతలు టిడిపిలో చేరడం విశేషం. విజయనగరం నుంచి ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు వెళ్ళిన వీరంతా టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. అయితే ఓ మహిళ నేత వెంట ఈ స్థాయిలో నేతలు వెళ్లడం ఏమిటన్న ఆసక్తికర చర్చ నడిచింది. అంతే ఆసక్తికర వార్త ఒకటి బయటకు వచ్చింది. ఇందుకూరి సుధారాణి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు భార్య. వీరిది విజయనగరం జిల్లాలోని శ్రుంగవరపుకోట నియోజకవర్గం. రఘురాజు బొత్స సత్యనారాయణ అనుచరుడు. గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నుంచి వైసీపీలో చేరారు. శృంగవరపుకోట టికెట్ను ఆశించారు. కానీ అనూహ్యంగా ఆ సీటును కడుబండి శ్రీనివాసరావుకు జగన్ కేటాయించారు. అయినా సరే ఇందుకూరి రఘురాజు గట్టిగానే పని చేశారు. కడుబండి శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా గెలుపొందేందుకు శక్తివంచన లేకుండా కృషి చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రఘురాజుకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. అయితే ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ కావాలని రఘురాజు కోరుతూ వచ్చారు. కానీ హై కమాండ్ పట్టించుకోలేదు. అందుకే రఘురాజు తన భార్యను టిడిపిలోకి పంపించినట్లు ప్రచారం జరుగుతోంది. గత కొంతకాలంగా ఎస్. కోట వైసీపీలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. దీనిపై రఘురాజు ఎప్పటికప్పుడు హై కమాండ్ కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఈ ఎన్నికల్లో కూడా తిరిగి కడుబండి శ్రీనివాసరావుకు టికెట్ కేటాయించినట్లు తెలుస్తోంది. దీంతో విసిగి వేశారిపోయిన రఘురాజు ముందుగా తన భార్యను టిడిపిలోకి పంపించినట్లు సమాచారం. ఇప్పటికే వైసీపీ నుంచి టిడిపిలో చేరిన ఎమ్మెల్సీల విషయంలో? వైసిపి హై కమాండ్ సీరియస్ గా ఉంది. అనర్హత వేటు వేయాలని నిర్ణయించుకుంది. అందుకే రఘురాజు మానసికంగా టిడిపిలో చేరేందుకు సిద్ధమయ్యారు. కానీ భౌతికంగా మాత్రం వైసీపీలోనే కొనసాగుతున్నారు. తద్వారా వైసిపి నాయకత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎస్.కోటలో వ్యక్తిగతంగా ఓటు బ్యాంకు ఉన్న నేతల్లో రఘురాజు ఒకరు. ఇప్పుడు ఆయన కుటుంబమే టీడీపీలో చేరింది. అటు రఘు రాజు సైతం అంతర్గతంగా టిడిపికి సహకరించనున్నారని ప్రచారం జరుగుతుంది. అయితే రాజకీయాల కోసం భార్య ఒక చోట.. భర్త మరోచోట ఉండడం మాత్రం ప్రాధాన్యత సంతరించుకుంది. సోషల్ మీడియాలో ఒక తరహా ప్రచారం జరుగుతోంది. అయితే భర్త సమ్మతం మేరకే ఆమె టిడిపిలో చేరినట్లు తెలుస్తోంది. దీంతో అసలు విషయం తెలుసుకుని నెటిజన్లు సైతం షాక్ కు గురవుతున్నారు

## పాలిటిక్స్‌ను ఊపేస్తున్న పాట

**ఒంగోలు :** లోక్‌సభ ఎన్నికలకు వేళవుతోంది. మరో వారం రోజుల్లో షెడ్యూల్ రావడం ఖాయమని ఎన్నికల సంఘం నుంచి సంకేతాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలను ఎలక్షన్ ఫీవర్ వెంటాడుతోంది. ఎన్నికల సందడితో వేసవికి ముందే వాతావరణం వేడెక్కుతోంది. ఇక సిని పరిశ్రమను కూడా ఎన్నికల వాతావరణ కోసం వాడుకోవడం మొదలు పెట్టాయి పార్టీలు. ఈ క్రమంలో ఎన్నికల ప్రసంగాలను, రాజకీయ నేతలు చేసే స్పీచ్‌లోని హుక్ ట్యాగ్స్ తీసుకొని రూపొందించిన ఓ పాట ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేఐస్తోంది. ఈ పాట తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ నేతలను, సినీ తారలను టార్గెట్ చేస్తూ ఓ సినీ రచయిత రాసిన పాట. ప్రస్తుతం ఫుల్ ట్రెండింగ్‌లో ఉంది. దక్షిణాదిలో సంచలన నటుడిగా ఉపేంద్రకు గుర్తింపు ఉంది. తాజాగా ఆయన చిత్రం యూఐ. గతంలో ఏ, ఉపేంద్రలాంటి చిత్రాలతో తెలుగులో సంచలన విజయాలు సాధించాడు. తాజాగా ఆయన యూఐ సీనిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమాలో ఉపేంద్రతోపాటు రిష్మా నన్నయ్య, సన్నీలియోన్, జిషుసేన్‌గుపన్తా, మురళీశర్మ ఇంద్రజిత్ లోకేష్ తదితరులు నటించారు. ఈ సినిమాకు అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. యూఐ సినిమా కోసం రాసిన పాట ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ సినిమాలో పవన్ కల్యాణ్ ప్రసంగంలో వాడిన మనల్నెవడురా ఆపేది.. నేను ఉన్నానంటూ ముద్దులు ఇచ్చే వైఎస్.జగన్ అంటూ.. కుర్చీ మడతపెట్టి అంటూ చంద్రబాబు ఇటీవల వాడిన డైలాగ్స్, పాలు అమ్మిన, పూలు అమ్మిన అనే మల్లారెడ్డి సెన్సేషనల్ డైలాగ్స్‌తో ఈ పాట క్రేజీగా ఉంది. ఇక ఈపాట నాయకులతో ఆగలేదు. వైరల్ కంటెంటు గురించి కూడా ఇందులో ప్రస్తావించారు. ఏవేవో అనుకుంటాం. అన్నీ అవుతాయా? అంటూ బాలయ్య చెప్పిన డైలాగ్స్‌ను పాట కోసం వాడుకోవడంతో మరింత క్రేజీగా మారింది. తెలుగు సినిమా పరిశ్రమలో టాప్ హుక్ డైలాగ్.. రెండు చేతులు జేబులో పెట్టుకుని ఎక్కడికో వెళ్తా అంటూ త్రివిక్రమ్ మాటలు, వర్త్ వర్మ అంటూ ఇటీవల క్రేజీగా మారిన డైలాగ్స్ పాటలో పొందుపర్చారు. అల్లు అర్జున్ జై బాలయ్య అంటూ చెప్పిన డైలాగ్స్ స్పెషల్ అట్రాక్షన్‌గా మారింది. రెండు రోజులుగా ఈ పాట ట్రెండింగ్‌లో ఉంది. సోషల్ మీడియాలో మీమర్స్, ట్రోలర్స్ ఈ పాటను ట్రెండ్ చేస్తున్నారు. దీంతో ఈ సినిమాకు మంచి ప్రమోషన్ లభిస్తుంది. వీనస్ ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై ఈ మూవీని జీ.మనోహరన్, శ్రీకాంత్ కేపీ నిర్మించారు. ఈ సినిమాకు ఉపేంద్ర స్వయంగా దర్శకత్వం వహించారు. వేణుగోపాల్ హెచ్‌సీ సినిమాటోగ్రాఫర్‌గా, విజయ్‌రాజ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. 100 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ సినిమా త్వరలోనే రిలీజ్ కాబోతోంది.

## ప్రణీత్ రావు... మాములోడు కాదు

**హైదరాబాద్ :** అంతా వారే. అన్నింటా వారే. అందుకే పదేళ్లపాటు దర్జాగా అన్ని కార్యక్రమాలు జరిగిపోయాయి. ప్రతిపక్షాల కుసాలు విరిగిపోయాయి. అధికార పక్షానికి అన్ని వ్యవస్థలు సలాం చేశాయి. గడచిన పది సంవత్సరాలు మాత్రమే కాదు.. వచ్చే ఏళ్లల్లోనూ తమదే అధికారం అనేలాగా గులాబీ కాంపౌండ్ నుంచి వ్యాఖ్యలు వినిపించాయి. ఇంతటి ఆత్మవిశ్వాసం ప్రదర్శించినప్పటికీ భారత రాష్ట్ర సమితి ఓడిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అధికారాంతమున చూడాలి అయ్యవారి చిత్రాలు అనేలాగా.. అప్పటి పాలనా కాలం నాటి ఘనకార్యాలు మొత్తం ఇప్పుడు వెలుగు చూస్తున్నాయి. అయితే అందులో ప్రణీత్ రావు అనే డి.ఎస్.పి వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. వాస్తవానికి ప్రణీత్ రావు తెలంగాణ ఏర్పాటుకు ముందు ఎస్సై స్థాయి అధికారి. కానీ అనూహ్యంగా డి.ఎస్.పి పదోన్నతి పొందారు. ఎస్ ఐ బి లో పనిచేయడం మొదలుపెట్టారు. వాస్తవానికి డిఎస్పీగా పదోన్నతి వచ్చిన ఒక అధికారికి ప్రభుత్వం లా అండ్ ఆర్డర్ పర్యవేక్షించే పోస్ట్ ఇస్తుంది. కానీ వాటన్నింటికీ భిన్నంగా ఆయనను ఎస్ ఐ బి లో నియమించింది. ఎస్ఐబిలో ప్రణీత్ రావు డిఎస్పీగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలు చక్కబట్టేవారని ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి ఇలాంటి ఫోన్ ట్యాపింగ్ ను నక్సలైట్లు, టెర్రరిస్టులపై ప్రయోగిస్తారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రం రాజకీయ నాయకుల మీద ఉపయోగించారు. ఈ వ్యవహారం ప్రణీత్ రావు ఆధ్వర్యంలో దర్జాగా సాగిందని, దీనికి అప్పటి ప్రభుత్వ పెద్దలు తెరవెనుక సహాయం చేశారనే విమర్శలు ఉన్నాయి. పదవి విరమణ చేసినప్పటికీ ఓ కీలక అధికారి ఇంటలిజెన్స్ విభాగంలో ముఖ్యపాత్ర పోషించారని.. ఆయన గత ప్రభుత్వ పెద్దలకు దగ్గరగా ఉండేవారని.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని ఆయనే పర్యవేక్షించే వారిని తెలుస్తోంది. భారత రాష్ట్ర సమితి అధికారాన్ని కోల్పోగానే ఇంటిలిజెన్స్ లో కీలకంగా పనిచేసిన ఆ అధికారి తన పదవికి రాజీనామా చేశారు. అంతేకాదు డి.ఎస్.పి ప్రణీత్ రావు కూడా చాలా వరకు రికార్డులను ధ్వంసం చేశారని తెలుస్తోంది. ఇది బయటి ప్రపంచానికి తెలియకుండా సీసీ కెమెరాలను పనిచేయకుండా నిలుపుదల చేశారని తెలుస్తోంది. ఈ వ్యవహారం మొత్తం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలియడంతో.. ఆ రికార్డులను రీ ట్రీవ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాదు ప్రణీత్ రావు వద్ద కీలక సమాచారం ఉందని.. దాని ద్వారా కెసిఆర్, కేటీఆర్ సాగించిన వ్యవహారాలను తెలంగాణ సమాజం దృష్టికి తీసుకురావాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాదు అప్పట్లో ప్రణీత్ రావు ఏపీ సీఎం ఫోన్ కూడా ట్యాప్ చేశారని.. ఆ ఫోన్ కాల్ రికార్డింగ్ తర్వాత బయటికి వచ్చిందని.. ఇలా ఎంతోమంది ఎమ్మెల్యేల ఫోన్లు టాప్ చేశారని అప్పట్లో ఆరోపణలు వినిపించాయి. భారత రాష్ట్ర సమితి ఇతర పార్టీల ఎమ్మెల్యేల విలీనానికి ప్రణీత్ రావు తోడ్పడ్డాడని.. దానికి ఫోన్ ట్యాపింగ్ ను వాడుకున్నారని తెలుస్తోంది. అయితే గతంలో జరిగిన వ్యవహారాలను మొత్తం తవ్వితీయాలని రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించినట్టు ప్రచారం జరుగుతోంది.


# పెన్నార్ లో బిఆర్టియు విజయ జయకేతనం

**- వరుసగా రెండోసారి ఘన విజయం**
**- కలిసి పోటీ చేసిన సిఐటియు, ఐ.ఎన్.టి.యు.సి కూటమికి తప్పని ఓటమి**

**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** పెన్నార్ పరిశ్రమలో నిర్వహించిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బిఆర్టియు జయకేతనం ఎగరవేసింది. వరుసగా రెండుసార్లు గెలిచి కార్మికుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంది. బుధవారం పరిశ్రమలో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో మొత్తం 508 ఓట్లకు గాను 507 ఓట్లు పోలయ్యాయి. ఇందులో రెండు ఓట్లు చెల్లక పోగా, బిఆర్టియు సంఘానికి 282 ఓట్లు, సిఐటియు ఐ ఎన్ టి యు సి ఐక్య కూటమికి 223 ఓట్లు పోలయ్యాయి. 59 ఓట్ల మెజారిటీతో బిఆర్టియు వరుసగా రెండవసారి ఘన విజయం సాధించింది. పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మార్గదర్శకత్వంలో బి ఆర్ టి యు తరఫున సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్ అధ్యక్షుడిగా పోటీ చేశారు. బిఆర్టియును ఓడించాలన్న లక్ష్యంతో సిఐటియు, ఐ ఎన్ టి యు సి యూనియన్లు కూటమిగా పోటీ చేసిన వారికి పరాజయం తప్పలేదు. ఈ సందర్భంగా పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా పటాన్చెరు నియోజకవర్గంలోని కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు, వారి కష్టసుఖాల్లో అండగా నిలిచామని తెలిపారు. గత పదిలుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కార్మికులకు తగు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని తెలిపారు. వరుసగా రెండుసార్లు బి ఆర్ టి యు యూనియన్ ను గెలిపించిన పెన్నార్ కార్మికులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని ఆయన తెలిపారు. బి ఆర్ టి యు రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి నాయకత్వంలో పెన్నార్ పరిశ్రమలో వరుసగా రెండోసారి బిఆర్టియు యూనియన్ ఘన విజయం సాధించడం జరిగిందని తెలిపారు. యూనియన్ విజయానికి సహకరించిన ప్రతి కార్మికుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# భక్తుల కోరికలు తీర్చే బ్రహ్మేశ్వరాలయం







**కనకాపూర్ గ్రామ నది ఒడ్డున వెలిసిన ఆలయం**

**వాస్తవ నేస్తం,లోకేశ్వరం,** బ్రహ్మేశ్వరం దేవాలయాల్లో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు: పిలిస్తే పలికే ప్రతిరూపంగా బ్రహ్మే శ్వర ఆలయం భక్తుల పాలిట కొంగుబంగారం విరాజిల్లుతున్నది. శివనామస్మరణతో బ్రహ్మేశ్వరాన్ని పూజిస్తే కోరుకున్న కోరికలన్నీ నెరవేరుతాయని ఇక్కడి భక్తుల విశ్వాసం. కొన్నేళ్ల క్రితం మండ లంలోని గోదావరి ఒడ్డున వెలిసిన బ్రహ్మేశ్వర ఆలయం దినది నాభివృద్ధి చెందుతున్నది. బ్రహ్మేశ్వరాలయం నిత్య పూజలతో వెలుగొందు తున్నది. ఇక్కడికి జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి సైతం భక్తులు వస్తుం బారు. శివరాత్రి రోజున గోదావరిలో స్నానమాచరిచి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ఆలయప్రాశస్త్యం.. కాకతీయుల కాలంలో గణపతి దేవుడి పాలనలో ఏళ్ల కిందట బ్రహ్మేశ్వరాలయాన్ని రాతితో నిర్మించారు. ఇక్కడి ప్రత్యేకత ఏమి బంటే... గోదావరి ఈ ఆలయ సమీపంలో ఉత్తరం దిక్కుగా ప్రతి హిస్తూ ఉత్తర వాహినిగా పేరుగాంచింది. ఇక్కడి గోదావరిలో స్నానమాచరించి బ్రహ్మేశ్వరున్ని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని పెద్దలు చెబుతుంటారు. దీనికితోడు సూర్యో దయం వేళ కాంతి కిరణాలు గోదావరిలోని నీటిపై పడి నేరుగా ఆలయంలోని శివలింగంపై పడతాయి. అత్యంత ప్రాశస్తి గాంచి నదిగా పేర్కొంటున్నారు. మండలంలోని కనకాపూర్ గ్రామ శివా రులోని గోదావరి ఒడ్డున ఆలయం నిర్మించడంతో వర్షాకాలంలో గోదావరి ప్రవాహానికి ఈ ఆలయం ముంపునకు గురవుతుంది. ఏళ్ల తరబడి నీటిలో ఉండేది. దీనికి తోడు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ తో మరింత ముంపు నీటిలోనే ఈ ఆలయం ఉండాల్సి వచ్చేది. కొన్నేళ్ల కిందట నేపాల్ నుంచి వచ్చిన సత్యా నంద స్వామి రాకతో బ్రహ్మేశ్వరాలయం బయటి ప్రపంచానికి తెలిసింది. దక్షిణ భారతదేశంలో శివాలయం పరిరక్షణ కోసం నేపాల్ నుంచి కొందరు స్వాములు వచ్చారు. ఇందులో భాగంగా

**ఆలయంలోని శివలింగం.. బ్రహ్మేశ్వర ఆలయం**

శ్రీ సత్యానంద స్వామి ఈ ప్రాంతానికి వచ్చి ముంపునకు గురవు తున్న బ్రహ్మేశ్వరాలయాన్ని పునరుద్ధరించాడు. ఆలయాన్ని తెరిచి దూపదీప నైవేద్యాలను సమర్పిస్తుంటారు. దీంతో పాటు భక్తులు బ్రహ్మేశ్వరున్ని నమ్ముకొని కోరుకున్న కోరికలు ఫలిస్తుండడంతో భక్తుల తాకిడి మరింత పెరిగింది.

**మూడు రోజుల పాటు జాతర..**

ప్రతి శివరాత్రి మూడు రోజుల పాటు జాతర నిర్వహించను న్నారు. మండల భక్తులే కాకుండా ముధోల్, భైంసా, కుంటా ల, దిలావర్పూర్, నిర్మల్తో పాటు మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి దర్శించుకుంటారు.

# గృహ జ్యోతి పథకాన్ని అందరికీ వర్తింప చేయాలి

**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** సదాశివపేట మండల పట్టణ పరిధిలో ఉన్న ప్రజలందరికీ గృహ జ్యోతి జ్యోతి పథకంలో అర్హులందరికీ అన్యాయం జరుగుతుందని, ఇది సరైన పద్ధతి కాదని తక్షణమే ప్రజలందరికీ గృహ జ్యోతి పథకాన్ని వర్తింపజేయాలని సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక కరెంట్ ఆఫీస్ ముందు నిరసన తెలియజేసి ఆఫీస్ లో వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహ జ్యోతి పథకాన్ని ప్రజలందరికీ వర్తింపచేయాలనే ఆయన డిమాండ్ చేశారు చాలామంది గ్రూప్ జ్యోతి పథకాన్ని దరఖాస్తులు పెట్టుకున్న కొంతమందికి మాత్రమే ఈనెల జీరో కరెంట్ బిల్లు రావడం సరికాదన్నారు అర్హులు అందరికీ పథకాన్ని ఈ నెల నుంచి అమలు చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా 200 యూనిట్లు దాటి ఒక్క యూనిట్ పెరిగిన మొత్తం బిల్లు చెల్లించాలని చెప్తున్నారని అలా కాకుండా పెరిగిన యూనిట్ల వరకే బిల్లులు వసూలు చేసేలా విధివిధానాల్లో మార్పులు చేయాలని ఆయన కోరారు. ఒక రేషన్ కార్డు కింద ఉన్న ఒక కుటుంబాన్ని మాత్రమే పరలోక తీసుకోవడం సరికాదని ఒక రేషన్ కార్డులో పేరు ఉన్నవారు రెండు మూడు కుటుంబాలుగా విడిపోయి బతుకుతున్నారు. వారంతా ఒకే ఇంట్లో వేరువేరు పోషన్లో వేరు వేరు ఇండ్లలో ఉంటున్నారని , కానీ ప్రభుత్వం వారందరినీ ఒకే కుటుంబం లెక్క కట్టి ఒక్కరికే ఈ పథకాన్ని వర్తింప చేస్తుందని ఇది సరైన పద్ధతి కాదని అని ఆయన అన్నారు . ఒకే రేషన్ కార్డులో ఎంతమంది ఉంటే వారికి కూడా గృహ జ్యోతి పథకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో సిపిఎం సదాశివపేట ఏరియా కమిటీ సభ్యులు ఏసోబు, అనిల్ సిపిఎం నాయకులు ఎండి ఖయ్యూం ,మహేష్ ,శ్రీకాంత్, రాజు నవీన్ తదితరులు పాల్గొన్నారు



# సిపిఎం నాయకులు దారెల్లి నాగేశ్వరరావు కి ఘన నివాళి

**నివాళులర్పించిన సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వున్నం వెంకటేశ్వరావు**

**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల పరిధిలో ఉన్న చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ నాయకులు క్రీ"శే దారెల్లి నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు.సిపిఎం పార్టీ గ్రామ నాయకులు సెలమల అజయ్ అధ్యక్షతన సంస్మరణ సభ బుధవారం నాడు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వున్నం వెంకటేశ్వరావు క్రీ"శే దారెల్లి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. తర్వాత కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. తర్వాత సంస్మరణ సభలో వున్నం వెంకటేశ్వరావు మాట్లాడు తూ సిపిఎం సభలు ఎక్కడ జరిగిన కానీ ముందుండే వ్యక్తి దారెల్లి నాగేశ్వరరావు ఈరోజు మన మధ్యన లేకపోవడం బాధాకరమని అన్నారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్త కార్యకర్తను కోల్పోవడం పార్టీకి మరియు ఇక్కడ ఎస్సీ కాలనీ కూడా చాలా నష్టమని తెలిపారు. అదేవిధంగా తన కుల పరంగా పెద్ద మాదిగ గా 100% న్యాయం చేసేవాడు. ఏ ధర్నాలు జరిగిన కూడా దారెల్లి నాగేశ్వరరావు ఎప్పుడూ అందుబాటులో ఉన్న వ్యక్తి కానీ ఇటీవల కాలంలో వాళ్ల నాన్న చనిపోవడం ఆ తరువాత ఇతనికి కూడా ఆరోగ్యం బాగోలేక ఈయన కూడా మన నుంచి దూరం కావడం జరిగింది.దారెల్లి నాగేశ్వరరావు కుటుంబం సిపిఎం పార్టీకి ఎల్లవేళల సేవలందించారని గుర్తుచేసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బంధం శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు పి. వెంకటేశ్వరావు, సిపిఎం పార్టీ గ్రామ మాజీ సర్పంచ్ బూసి వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ మండల నాయకులు యేసుపోగు బాబు, సిపిఎం పార్టీ గ్రామ సెక్రెటరీ బండి శ్రీనివాసరావు, బోయినపల్లి పున్నయ్య,సెలమల హారిశ్వరరావు,కొండేటి అప్పారావు, తోటకూరి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అవగాహన



**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మండలములోని గుమ్మిర్యాల్ గ్రామ పంచాయతీలో బుధవారం ఏర్గట్ల పోలీస్ వారు యువకులకు ఆన్లైన్లో మోసాల పై అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ మాట్లడుతూ సైబర్ నేరాల పట్ల యువకులు అప్రమత్తంగా ఉండాలని అమ్మాయిల వేషధారణలో వీడియో కాల్స్ చేస్తూ యువకులను బ్లాక్ మెయిల్ చేస్తూన్నారని ఒక వేల మీకు అలాంటి కాల్స్ గాని వస్తె అప్రమత్తంగా ఉండి మోసాలకు గురి కావద్దని అన్నారు. ఒక వేల మోసపోయినట్లయితే హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు పంప్రదించలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీధర్, రాము, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.


## మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే సమాజాభివృద్ధి

**సీనియర్ బ్రాంచ్ మేనేజర్ భాను కుమార్**




**వాస్తవ నేస్తం,కోదాడ:** మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని కోదాడ ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్. భాను కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం ముందస్తుగా ఎల్ఐసి ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుంటున్నారని మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే సమాజం సుభిక్షంగా ఉంటుందన్నారు. సృష్టికి మూలమైన మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. అనంతరం మహిళ ఉద్యోగులను, ఏజెంట్లను శాలువా, పుష్పగుచాలు అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్ సంజీవయ్య,యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులువిజయ శంకర్,కన్నయ్య,మహిళా కార్యదర్శి సువర్ణ రాణి, శ్యాంబాబు, రామారావు,రమేష్, సైదా, బాలకృష్ణ,సొందుమియా, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి



**వాస్తవ నేస్తం,కుంటాల:** మండలం ఓలా గ్రామంలో శ్రీ విఠల రుక్మబాయి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో ముథోల్ మాజీ శాసనసభ్యులు జి విట్టల్ రెడ్డి, నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే గణేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శంకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ ప్రవీణ్, రాజేందర్, గ్రామస్తులు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## లోకేశ్వరం ఎస్ఐగా రాజు బాధ్యతలు




**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** ఎస్ఐగా రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న ఎస్ఐ సాయి కుమార్ పెంబికి బదిలీ అయ్యారు. కడెం నుండి ఎస్సై రాజు లోకేశ్వరంకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు అందరూ సహకరిస్తే అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తెలిపారు.పోలీసులకు సహకరించాలని అన్నారు. పోలీసు చట్టానికి విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకుంటామని అన్నారు. మండలం ప్రశాంత వాతావరణంలో ఉండాలని కోరారు.

# ఒక యూనిట్ పెరిగితే ఏం చేయాలి



**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల్లో గృహజ్యోతి 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ స్కీమ్ ఒకటి. ఆరు గ్యారంటీల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఇటీవలె ఈ పథకాన్ని అమలు చేశారు. అయితే పథకంలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయని మాజీ మంత్రి , బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపిస్తున్నారు. నిరుపేదలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పథకం అమలు చేసే విషయంలో అర్హులకు అన్యాయం జరుగుతోందన్నారు. తెలంగాణలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుకునే వినియోగదారులకు ఎలాంటి బిల్లు వసూలు చేయవద్దని...వారికి జీరో బిల్లు ఇస్తున్నారని హరీశ్ రావు అన్నారు. అయితే ఈ ప్రభుత్వ పథకంలో జరుగుతున్న పొరపాటు వల్ల లక్షలాది మంది అర్హులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కేవలం 200 యూనిట్లవరకు వినియోగించిన వారికి అధికారులు జీరో బిల్లు ఇస్తున్నారని తెలిపారు. కానీ ఒక్క యూనిట్ ఎక్కువ వచ్చినా సరే, మొత్తం 201 యూనిట్లకు బిల్లు వసూలు చేస్తున్నారన్నారు. వినియోగదారులు ప్రతీ రోజు పొద్దున లేచి తాము ఎంత కరెంటు కాలుస్తున్నాము? మీటర్ ఎంత తిరుగుతుంది? అనేది గమనించుకోవాల్సిన పరిస్థితి తెచ్చారని ఆరోపించారు. ఫ్యాన్ వేసుకోవాలా? వద్దా? లైట్ వేసుకోవాలా? వద్దా? అనేది మీటర్ రీడింగ్ చూసి నిర్ణయించుకోవాల్సిన దుస్థితికి పేదలను నెట్టడం బాధాకరం అన్నారు.కాబట్టి 200 యూనిట్ల కన్నా ఎక్కువ కరెంటు వాడినప్పటికీ, పై యూనిట్లకు మాత్రమే బిల్లు వేసే విధంగా నిబంధనలు రూపొందించాలని హరీశ్ రావు ప్రభుత్వాన్ని కోరారు. 200 యూనిట్లు దాటితే, 200 యూనిట్ల వరకు అయ్యే భారాన్ని ప్రభుత్వమే భరించి, మిగతా యూనిట్ల ధరను వినియోగదారుడు చెల్లించే విధంగా బిల్లింగ్ వ్యవస్థలో మార్పులు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 90 లక్షల మంది తెల్లరేషన్ కార్డులుంటే, ప్రభుత్వం కేవలం 30 లక్షల మందికి మాత్రమే ఈ పథకాన్ని అమలు చేస్తుందని ఆరోపించారు. మిగతా 60 లక్షల మందికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. హైదరాబాద్ నగరంలో కూడా 30 లక్షల మంది పేదలుంటే, కేవలం 10 లక్షల మందికే పథకం అమలు చేయాలని నిర్ణయించారన్నారు. మిగతా వారికి నష్టం కలుగుతుందన్నారు. మొత్తంగా కేవలం మూడో వంతు పేదలకు మాత్రమే ఈ పథకం వర్తింపజేస్తున్నారని విమర్శించారు. రెండు వంతుల పేదలను విస్మరిస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు."ఒక రేషన్ కార్డు కింద ఒక కుటుంబాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకుంటున్నారు. ఒక రేషన్ కార్డులో పేర్లున్న వారు రెండు మూడు కుటుంబాలుగా కూడా విడిపోయి బతుకుతున్నారు. వారు ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో, వేర్వేరు అంతస్తుల్లో ఉంటున్నారు. కానీ ప్రభుత్వం వారందరినీ ఒకే కుటుంబంగా లెక్క కట్టి ఒక్కరికే పథకం వర్తింప చేస్తుంది. ఇది కూడా సరైన పద్ధతి కాదు. ఎన్ని కుటుంబాలుంటే అన్ని కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింప చేయాలని కోరుతున్నాను. నిజమైన పేదలకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమైతే, మొత్తం 90 లక్షల పేద కుటుంబాలకు లబ్ది కలిగేలా చేయాలి. అలా చేయని పక్షంలో ఈ పథకం కేవలం నామమాత్రంగానే మిగిలిపోతుంది. హామీల అమలుకు ప్రభుత్వమే తూట్లు పొడిచినట్లు అవుతుందనే విషయాన్ని మీ దృష్టికి తెస్తున్నాను. నిజంగా పేదలకు సాయం చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉంటే, వెంటనే పై మూడు విషయాల్లో తక్షణం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు.

# రేవంత్ అత్యుత్సాహమా.. మైండ్ గేమా....




**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ కాంగ్రెస్ నాయకుడు కంటే ముందు అచ్చమైన రాజకీయ నాయకుడు అని నిరూపించుకున్నారు. మోదీ పాలనను విమర్శిస్తూ.. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనని ప్రచారం చేసి ఎన్నికల్లో ప్రయోజనం పొందిన ఆయన ఇప్పుడు ప్రధాని మోదీ విషయంలో మాత్రం పూర్తిగా యూటర్న్ తీసుకున్నారు. చేవెళ్ల సభలో గుజరాత్ మోడల్ అంటే రైతుల్ని చంపడమేనని ఆరోపించిన సీఎం రేవంత్ రెడ్డి మోదీ వేదికపై ఉన్న స్టేజ్ మీద మాత్రం.. గుజరాత్ లాగా తెలంగాణను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీని బడే భాయ్‌గా అభివర్ణించారు. 'ప్రధాని మోదీ మాకు పెద్దన్న లాంటి వారు' ప్రధాని నరేంద్ర మోదీ ఆదిలాబాద్ పర్యటనలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్య ఇది. తమకు బీజేపీ మోదీతో మాత్రమే విభేదాలు ఉన్నాయని, ప్రధాని మోదీతో తమకు ఎటువంటి ఇబ్బందులు లేవని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మోడీని వ్యతిరేకిస్తున్నాం అంటే కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నట్లు కాదని, కేంద్ర ప్రభుత్వం అంటే కేంద్ర మంత్రి వర్గం, ప్రధానమంత్రి ఉంటారు. వారితో రాష్ట్ర ప్రభుత్వానికి సత్సంబంధాలు ఉండాలనే తాము ఆకాంక్షిస్తామని హితవు పలికారు. ఆ తర్వాత నొప్పించకుండా సుతిమెత్తగా తన విన్నపాలను మోడీ ముందు ఉంచారు. ఈ సభలో మాట్లాడుతూనే ప్రధాని అంటే మాకు పెద్దన్న లెక్క, ఆయనతో గొడవ పడతామా అని ప్రధాని మోదీ విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవహార శైలిని పరోక్షంగా ఎండగట్టారు. ఇది రేవంత్ రాజకీయ వ్యూహమే అనుకోవచ్చు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రాల పర్యటనకు వచ్చింది ఎన్నికల ప్రచారం కోసమని అందరికీ తెలుసు. కానీ ఆయన అందుకు వేసిన ముసుగు మాత్రం అభివద్ధి పనులు. అయితే సీఎం రేవంత్ రెడ్డి మోదీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మోదీని పెద్దగా చెప్పుకున్నారు. ఆయనతో రాసుకుని పూసుకుని తిరిగారు. నవ్వుకున్నారు. రేవంత్ తీరు చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. దేశంలో ప్రభుత్వాలు నిలబడాలంటే కంద్రం .. ముఖ్యంగా మోదీ, షా అనుగ్రహం ఉండాల్సిందే. తేడా వస్తే ఏం జరుగుతుందో మహారాష్ట్రలో చూశాం. హిమాచల్ ప్రదేశ్ లో చూస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల తరవాత రేవంత్ ప్రభుత్వం ఉంటుందో ఉండదో తెలియదంటూ బీజేపీ నాయకులు వ్యూహాత్మకంగానే విమర్శలు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో రేవంత్ రెడ్డి నేరుగా ప్రధాని మోదీకే మాటలతో కాకుండా చేతలతో సందేశం ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితాలు ఎలా వచ్చినా బీజేపీకి ఇప్పటికప్పుడు ప్రభుత్వాన్ని కూలగొట్టాల్సిన అవసరం ఏముంది.. మనమంటే గౌరవమే కదా అని అనిపించుకునేలా రేవంత్ రెడ్డి వ్యవహరించారని రాజకీయవర్గాలు అచనా వేస్తున్నాయి. ప్రధాని మోదీ కూడా.. రేవంత్ విషయంలో అంత వ్యతిరేకంగా ఉన్నట్లుగా కనిపించడం లేదు. ఆయన కాంగ్రెస్ సీఎం అయినప్పటికీ.. తనకు చక్కగా ప్రోటోకాల్ ఇచ్చి.. ఏ మాత్రం వివాదాస్పదం కాకుండా మాట్లాడిన రేవంత్ రెడ్డిపై మోదీకి అభిమానం పెరగకుండా ఉంటుందా అన్న సందేహం ఎవరికైనా వ్సతుంది. రేవంత్ రెడ్డి ..మోదీ విషయంలో కాస్త అతిగా వ్యవహరించి.. ఆయనతో శత్రుత్వం లేకుండా చూసుకోవచ్చు కానీ.. ఇలా చేయడం వల్ల కాంగ్రెస్ హైకమాండ్ లో రేవంత్ పై ఏర్పడే అనుమానాలను ఎలా నివృతి చేస్తారన్నది కీలకం. రేవంత్ రెడ్డి స్వతహాగా కాంగ్రెస్ లీడర్ కాదు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనను కాంగ్రెస్ లోకి ఆహ్వానించినా వెళ్లలేదు. ముందుగా రేవంత్ కెరీర్.. ఏబీవీపీ నుంచి ప్రారంభమైందని అందరూ చెబుతారు. అది నిజం కూడా. ఆయన లక్ష్యం కేసీఆర్ ను ఓడించి ముఖ్యమంత్రిని కావడం. రాజకీయ ఏకీకరణ పేరుతో కాంగ్రెస్ లో చేరారు. ఆ లక్ష్యాన్ని అందుకున్నారు. ఇప్పుడు ఆయన లక్ష్యం ప్రభుత్వాన్ని కాపాడుకోవడం. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా ఓ సారి ప్రధాని మోదీని ఢిల్లీలో కలిశారు. అప్పట్లో రేవంత్ రెడ్డి వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఉన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకంగా ... చేశారని చెప్పలేం కానీ.. మోదీతో ఆయన రాపో పెంచుకోవడానికి చేసిన ప్రయత్నాలు మాత్రం..ఆయనపై కాంగ్రెస్ హైకమాండ్‌లో ఓ సందేహం లెవనెత్తే అవకాశాలు ఉన్నాయి. దీన్ని పెంచేందుకు బీఆర్ఎస్ తో పాటు కాంగ్రెస్ లోని ఆయన ప్రత్యర్థులు ప్రయత్నిస్తారు. అదే రాజకీయం.రేవంత్ రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ ను అధికారంలోకి తెచ్చారు. దానికి రేవంత్ కు బాగా సాయం చేసింది.. బీజేపీ అనే అనుకోవాలి. బీజేపీ వ్యూహం ఏమిటో తెలియదు కానీ.. కీలకమైన సమయంలో బండి సంజయ్ ను పదవి నుంచి తప్పించారు. కల్వకుంట్ల కవితను అరెస్టు చేయలేదు. దీంతో .. బీజేపీ వెనుకబడిపోయింది. చివరికి కాంగ్రెస్ గెలిచింది. అందుకే బండి సంజయ్..తరచూ తమ నోటి కాడ కూడు రేవంత్ రెడ్డి లాగేసుకున్నారని అంటున్నారు. ఆయన లాక్కున్నారన్నదాని కన్నా.. వారే ఇచ్చారనడం కరెక్ట్. ఆ అభిమానం రేవంత్ రెడ్డి చూపిస్తున్నారేమో కానీ.. రేవంత్ రాజకీయం మాత్రం... భిన్నంగా ఉంది. కానీ ఆయన రాజకీయాల్ని తనదైన శైలిలో డీల్ చేయగలరని.. ఆయన రాజకీయ ప్రస్థానం చూస్తే అర్థమైపోతుంది.

# కీలక నాయకులు భారత రాష్ట్ర సమితికి గుడ్ బై





**హైదరాబాద్ :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ అభ్యర్థుల వివరాలను ప్రకటించారు. కరీంనగర్ అభ్యర్థిగా బోయినపల్లి వినోద్ కుమార్, పెద్దపల్లి అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్ పేర్లను ఇదివరకే కేసీఆర్ ప్రకటించారు. తాజాగా మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి మాలోత్ కవిత, ఖమ్మం నియోజకవర్గం నుంచి నామ నాగేశ్వరరావు పోటీ చేస్తారని కేసీఆర్ ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయం పొందిన నేపథ్యంలో కీలక నాయకులు భారత రాష్ట్ర సమితికి గుడ్ బై చెబుతున్నారు. జహీరాబాద్ ఎంపీ పాటిల్, పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, నాగర్ కర్నూల్ ఎంపీ రాములు భారత రాష్ట్ర సమితి నుంచి బయటికి వచ్చారు. వీరిలో వెంకటేష్ నేత కాంగ్రెస్ పార్టీలో చేరగా.. పాటిల్, రాములు కాషాయ కండువా కప్పుకున్నారు. బిజెపి ఇప్పటికే 9 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో.. శ్రేణుల్లో ధైర్యం నింపేందుకు కేసిఆర్ నలుగురు అభ్యర్థులను ప్రకటించారు.తెలంగాణ భవన్లో కార్యకర్తలతో, ముఖ్య నాయకులతో కెసిఆర్ సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలపై సుదీర్ఘంగా చర్చించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ మధ్య ఉంటుందని కెసిఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ఏదో అదృష్టం కొద్దీ మొన్నటి ఎన్నికల్లో గెలిచిందని.. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పరిస్థితి ఉండదని కెసిఆర్ ప్రకటించారు. పార్లమెంటు ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి అభ్యర్థులు సత్తా చూపిస్తారని ఆయన వివరించారు.. ఆదివారం నిర్వహించిన సమావేశంలో పెద్దపల్లి, కరీంనగర్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్.. సోమవారం మరో ఇద్దరు అభ్యర్థుల పేర్లను వెల్లడించారు. అయితే భారత రాష్ట్ర సమితి నుంచి పోటీ చేయడానికి చాలామంది అభ్యర్థులు వెనుకంజ వేస్తున్నట్టు తెలుస్తోంది. అందుకే కెసిఆర్ ఒకేసారి అభ్యర్థుల పేర్లను ప్రకటించడం లేదని సమాచారంఇక సోమవారం ప్రకటించిన మహబూబాబాద్ పార్లమెంటు స్థానానికి సంబంధించి మాలోత్ కవిత పోటీ చేయరని అందరూ అనుకున్నారు. ఈ స్థానం నుంచి ఖమ్మం జిల్లా వైరా మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ తనయుడు, ఐ ఆర్ ఎస్ అధికారి జీవన్ లాల్ పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. టికెట్ కూడా ఆయనకే ఇస్తారని భారత రాష్ట్ర సమితిలో ఒక వర్గం నాయకులు అనుకున్నారు. ఇటీవల మహబూబాబాద్ నియోజకవర్గంలో జీవన్ లాల్ సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్లమెంట్ స్థానానికి తాను బరిలో ఉన్నట్టు సంకేతాలు ఇచ్చారు. కానీ తీరా అభ్యర్థిని ప్రకటించే విషయంలో కెసిఆర్ కవిత వైపు మొగ్గు చూపారు. కెసిఆర్ నిర్ణయంతో జీవన్ లాల్ వర్గం డీలా పడినట్టు తెలుస్తోంది.

## విగ్రహ ప్రతిష్టాపనలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు



**వాస్తవ నేస్తం,భైంసా:** మండలం మహాగాం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ త్రయంబకేశ్వర దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోస్లే మోహన్ రావు పటేల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇందులో బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన ఆదిత్య గుప్తా



**వాస్తవం నేస్తం,కోటగిరి:** కోటగిరి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ – తెలంగాణ పొలిటికల్ కమిటీ చైర్మన్ మాశెట్టి ఆదిత్య గుప్తా మంగళవారం పటాన్చెరువు ఎల్లంకి కాలేజీలో జరిగిన భారత ప్రధాని నరేంద్ర మోడీ సభలో జహీరాబాద్ ఎంపీ బిబి పాటిల్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మశెట్టి ఆదిత్య గుప్తా మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశానికి చేసిన సేవను చూసి ఆకర్షితునై తన వంతు దేశ సేవ చేయాలని ఉద్దేశంతో పార్టీలో చేరడం జరిగిందని ఆయన అన్నారు.

## ఈ రోడ్డుకు మోక్షం వచ్చేనా...?



**వాసవ నేస్తం,ముథోల్:** ముథోల్ నుండి విట్టోలి వెళ్లే రోడ్డుపై పూర్తిగా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముథోల్ మండల కేంద్రం నుండి వివిధ గ్రామాలకు నుండి లోకేశ్వరం మండలం పంచగుడి గ్రామం వరకు గుంతల మయం అవడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, చిన్నపాటి వాహనాలు రోడ్డుపై నుండి ప్రయాణించడానికి పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రైతు వేదికల ద్వారా నేరుగా రైతులకు శిక్షణ




**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల పరిధిలోని బోనకల్ రైతు వేదిక నందు దృశ్యశ్రవణ (వీడియో కాన్ఫరెన్సింగ్) సేవలను రైతునేస్తం పేరుతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి బుధవారం సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు.రాష్ట్రవ్యాప్తంగా 2601 రైతు వేదికలు ఉండగా. వీటిలో 'రియల్ టైమ్ సొల్యూషన్ ద్వారా డిజిటల్ ప్లాట్‌ఫాం' ప్రాజెక్టు కింద ప్రయోగాత్మకంగా మొదటి విడత 110 కేంద్రాల్లో ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ దీనికి పరికరాలు సమకూర్చింది. టీఫైబర్, బీఎస్ఎన్ఎల్‌లు కనెక్టివిటీ కేబుల్ నెట్‌వర్క్‌ను సమకూర్చాయి. వచ్చే ఉగాది నాటికి మిగిలిన అన్ని రైతువేదికల్లో ఈ వ్యవస్థను అనుసంధానం చేయాలని నిర్ణయించారు.శాస్త్రవేత్తలు,అధికారులు,రైతుల మధ్య ప్రత్యక్ష, పరస్పర విషయ మార్పిడికి జూమ్, యూట్యూబ్ లైవ్ ద్వారా రైతువేదికలకు లింక్ చేస్తారని తెలిపారు. శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులతో క్షేత్రస్థాయి సమస్యలపై ముఖాముఖిగా చర్చిస్తారని చెప్పారు. డిజిటల్ సేవలలో భాగంగా శాస్త్రవేత్తలు, నిపుణులు ఎల్లపుడూ అందుబాటులో ఉంటారని చెప్పారు. రైతు వేదికల్లో ప్రతి మంగళవారం,శుక్రవారం రైతులకు నేరుగా ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారని వివరించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి సి.హెచ్.వెంగమాంబ,ఏడీఏ మధిర కొంగర వెంకటేశ్వరరావు,మండల వ్యవసాయ అధికారులు సర్వసుద్ది సరిత, డీఎన్ కే శ్రీనివాసరావు,కొండూరి విజయభాస్కర్ రెడ్డి (ఎర్రుపాలెం),పల్లెల నాగయ్య(చింతకాని),అనిల్ కుమార్(సాంకేతిక), వ్యవసాయ విస్తరణ అధికారులు, వైస్ ఎమ్ పీపీ గుగులోత్ రమేష్ వివిధ గ్రామాల రైతులు హాజరయ్యారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, RNI NO: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com

## బిజినెస్

# టాటా కంపెనీ రెండు ముక్కలు

### ఈవీల జోరు.. కీలక ఖనిజాలకు డిమాండ్ !



ఎలక్ట్రిక్ కార్లు, పవన విద్యుత్ పరిశ్రమల విస్తరణ కారణంగా దక్షిణ కొరియాలో కీలకమైన ఖనిజాల డిమాండ్ 2021 నుండి 2040కి 19 రెట్లు పెరుగుతుందని ఆది వారం ఒక నివేదిక వెల్లడించింది. కొరియా ఎనర్జీ ఎకనామిక్స్ ఇన్‌స్టిట్యూట్ (కెఇఇఐ) నివేదిక ప్రకారం ఎలక్ట్రిక్ కోసం అవసం మైన లిథియం, నికెల్, మాంగనీస్, కోబాల్ట్‌కు భారీ డిమాండ్ ఉంటుందని పేర్కొంది. కార్ బ్యాటరీల తయారీలో వీటి డిమాండ్ 2021 నాటికి 2040 నాటికి వరుసగా 15రెట్లు, 12 రెట్లు, 19 రెట్లు, 4 రెట్లు పెరగనున్నట్లు తెలిపింది. ఇదే కాలంలో దక్షిణ కొరియాలో ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు 11రెట్లు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో ఎలక్ట్రిక్ కార్ మోటార్‌లకు అవసరమైన నియోడైమియం, ప్రాసియోడైమియం, డిస్ప్రోసియం, టెర్బియమ్‌లకు డిమాండ్ 10 రెట్లు పెరుగుతుంది. 2022 నుండి 2040 నాటికి కొత్త విడతల పవన విద్యుత్ సౌకర్యాలు ఎనిమిది రెట్లు పెరిగే అవకాశం ఉందని నివేదిక చూపించింది. నియోడైమియం, ప్రసోడైమియం, డిస్ప్రోసియం, టెర్బియం వంటి సంబంధిత పదార్థాలకు డిమాండ్ వరుసగా 2.6 రెట్లు, 3.1 రెట్లు, 21.6 రెట్లు , 2.7 రెట్లు పెరుగుతుందని నివేదించింది.

### ఈ వారమే మార్కెట్‌లోకి వివో వి30 సిరీస్




భారత మార్కెట్లో ప్రముఖ చైనా స్మార్ట్ ఫోన్ వివో నుంచి త్వరలో వివో వి30 సిరీస్ లాంచ్ కానుంది. మార్చి 7న ఈ ఫోన్ లాంచ్ కానుండగా.. ఈ మిడ్-రేంజ్ ఫోన్ ధర వివరాలు ఆన్‌లైన్‌లో లీక్ అయ్యాయి. వి30 బేస్ వేరియంట్ దాదాపు రూ.40వేలు ధర ఉంటుందని తెలుస్తోంది. వివో వి30 ప్రో మోడల్ ధర సుమారు రూ.45వేలుగా ఉండవచ్చు. ఇక రెండు డివైజ్‌ల్లో 6.78-అంగుళాల కర్వ్‌డ్1.5కె అమోల్డ్ డిస్‌ప్లేతో 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్, 300హెచ్‌జెడ్ టచ్ శాంప్లింగ్ రేట్, 2,800 నిట్‌ల గరిష్ఠ ప్రకాశంతో వస్తాయి. ప్రామాణిక మోడల్‌లో క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 7 జెనరేషన్ 3 చిప్‌సెట్ ఉంటుంది. అయితే, ప్రో వెర్షన్ మీడియాటెక్ డైమెన్సిటీ 8200 ఎస్ఓసీని ఎంచుకుంటుంది. వివో వి30 ఇండోనేషియన్ వేరియంట్ 12జీబీ వరకు ఎల్‌పీడీడీఆర్4ఎక్స్ ర్యామ్, 512జీబీ వరకు యూఎఫ్ఎస్ 2.2 స్టోరేజ్‌ను అందిస్తుంది. అయితే, వి30 ప్రో మోడల్ 12జీబీ ఎల్‌పీడీడీఆర్5ఎక్స్ ర్యామ్, 512జీబీ యూఎఫ్ఎస్ 3.1 స్టోరేజ్‌తో వస్తుంది. ఆండ్రాయిడ్ 14 ఓఎస్ ఆధారంగా ఫన్‌టచ్‌ఓఎస్ 14పై రన్ అవుతున్నాయి. చివరగా, 80డబ్ల్యూ ఫాస్ట్ వైర్డ్ ఛార్జింగ్‌కు సపోర్టుతో 5,000ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. వివో వి30 డ్యూయల్ రియర్ కెమెరా సెటప్‌తో వస్తుంది, ఓఐఎస్ సపోర్టుతో 50ఎంపీ ప్రైమరీ సెన్సార్‌ను కలిగి ఉంటుంది. అలాగే, అల్ట్రా-వైడ్-యాంగిల్ లెన్స్‌తో మరో 50ఎంపీ సెన్సార్‌ను కలిగి ఉంటుంది. మరోవైపు, వివో వి30 ప్రో ట్రిపుల్ వెనుక కెమెరా సెటప్‌కు 50ఎంపీ పోర్ట్రెయిట్ లెన్స్‌ను అందిస్తుంది. సెల్ఫీలు, వీడియో కాల్‌ల విషయానికి వస్తే.. రెండు ఫోన్‌లు 50ఎంపీ ఫ్రంట్ కెమెరాను కలిగి ఉంటాయి.

టాటా కంపెనీ అంటే తెలియని భారతీయుడు ఉండడు. ఆ కంపెనీ తయారుచేసిన వస్తువులను వాడని ఈ వ్యక్తి మనదేశంలో ఉండడు. అంతగా పెనవేసుకుపోయింది ఆ కంపెనీ. టాటా మోటార్స్ ఆటోమొబైల్ రంగంలో మన దేశంలో దిగ్గజ సంస్థగా వెలుగొందుతోంది. సోమవారం ఈ కంపెనీ రెండు ముక్కలుగా విడిపోయింది. దీనికి కంపెనీ బోర్డ్ కూడా ఆమోదం ప్రకటించింది.. దీంతో టాటా కంపెనీ తన వాహనాలకు సంబంధించి రెండు లిస్టెడ్ కంపెనీలుగా విభజించింది. ఈ రెండు రంగాల్లో ఉన్న వ్యాపార అవకాశాలను మరింతగా అందిపుచ్చుకునేందుకు ఇలా విభజించామని టాటా చెబుతోంది. విభజన తర్వాత టాటా మోటార్స్ వాణిజ్య వాహనాలు, వాటికి సంబంధించిన పెట్టుబడులు ఒక లిస్టెడ్ కంపెనీగా ఏర్పాటయ్యాయి. టాటా మోటార్స్ ప్రయాణికుల వాహనాలు, ఎలక్ట్రిక్ వాహనాలు, లాండ్ రోవర్, జాగ్వార్ వంటివి మరో లిస్టెడ్ కంపెనీగా అవతరించాయి. విభజన అనంతరం టాటా మోటార్స్ తన బాటాదారులందరికీ నమోదిత సంస్థలో షేర్లు కేటాయించింది. కేటాయింపు మాత్రమే కాదు మార్కెట్లో ఉన్న అవకాశాలు మొత్తం మరింత విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. మార్కెట్ వర్గాల ప్రకారం ఈ విభజనకు వాటాదారులు, రెగ్యులేటరీ సంస్థల అనుమతి లభించేందుకు




ఏడాది లేదా ఏడాదిన్నర సమయం పట్టవచ్చు అని తెలుస్తోంది. టాటా మోటార్స్ విభజన తర్వాత స్టాక్ మార్కెట్లో షేర్లు పరుగులు పెట్టాయి. ఇప్పటివరకు టాటా మోటార్స్ షేర్ శాతానికి పైగా లాభ పడింది. మంగళవారం మధ్యాహ్నానికి 1,048.85 రూపాయల వద్ద ట్రేడ్ అవుతూనే ఉంది. కంపెనీ విభజన నేపథ్యంలో మదుపరులు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో షేర్ల ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కేవలం మంగళవారం మాత్రమే కాదు వచ్చే రోజుల్లో కూడా టాటా మోటార్స్ షేర్ల ధరలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

## గోదాములోని సరుకుపై బ్యాంకు లోన్



ఉద్యోగులకు రుణాలు కావాలంటే నేరుగా పేస్లిప్‌లు తీసుకెళ్లి అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు బ్యాంకులో ఇచ్చేసి రుణాలు తీసుకుంటారు. అదే రైతులకు రుణాలు కావాలంటే భూమి పట్టా పుస్తకాలు బ్యాంకులో తనఖా పెట్టాల్సి ఉంటుంది. అయితే చాలామందికి వారు పండిస్తున్న పంటభూమికి పట్టాలుండవు. కవులు రైతులు రుణాలు తీసుకోవాలంటే చాలాకష్టంతో కూడుకున్న వ్యవహారం.పంట మార్కెట్‌కు తరలించి వచ్చినకాడికి తెగనమ్ముకుని ఆ డబ్బును తదుపరి పంట కోసం పెట్టుబడికి ఉపయోగిస్తుండడం ఆనవాయితీగా వస్తుంది. భవిష్యత్తులో సరుకు మంచిధర పలుకుతుందని తెలిసి నా అవసరాల కోసం అమ్ముకోక తప్పదు. అలాంటి వారికోసం ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించింది. ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ఉన్న గోదాముల్లో రైతులు తమ పంటలను స్టోర్ చేసుకుంటే, వీటిపై లోన్లు పొందేందుకు కేంద్రం వీలు కలిపిస్తోంది. ఇందుకు సంబంధించి ఫుడ్ అండ్ కన్జ్యూమర్ అఫైర్స్ మినిస్టర్ పియూష్ గోయల్ సోమవారం 'ఈ-కిసాన్ ఉపజ్ నిధి' డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. ఈ విధానం అమల్లోకి వస్తే రైతుల ఆదాయాలు పెరుగుతాయని మంత్రి అన్నారు. వేర్ హౌస్ ఓనర్లు చెల్లించే సెక్యూరిటీ డిపాజిట్లను ఒక శాతానికి తగ్గిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇది 3 శాతంగా ఉంది. వంట నూనెల దిగుమతులను తగ్గించి, నూనె గింజల ఉత్పత్తిని పెంచేందుకు ఓ మిషన్ లాంచ్ చేయనున్నట్లు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి అర్జున్ ముండా సోమవారం పేర్కొన్నారు. ఇందుకోసం రూ.11 వేల కోట్లు ఖర్చు చేయనున్నామన్నారు. దీంతో పాటు అస్సాంలో ఏర్పాటు చేసిన ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్ఐ)ను ఆయన ప్రారంభించారు.

### ఇక ట్రైన్ జర్నీలోనూ స్విగ్గీ ఫుడ్ డెలివరీ

స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ యాప్స్‌తో నచ్చిన ఆహారాన్ని.. ఉన్న చోటుకే తెప్పించుకుని తినేస్తున్నాం. ఈ డెలివరీ సర్వీసులు దాదాపు నగరాలకే పరిమితమయినప్పటికీ, స్విగ్గీ మాత్రం 'ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్'తో ఒప్పందం కుదుర్చుకుని మరో అడుగు ముందు వేసింది. స్విగ్గీ ఫుడ్ మార్కెట్‌ప్లేస్ అండ్ ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ మధ్య జరిగిన అవగాహన ఒప్పందం ప్రకారం ఇకపైన రైళ్లలో ప్రీ-ఆర్డర్ చేసిన ఆహారాన్ని డెలివరీ చేయడానికి స్విగ్గీ సన్నద్ధమైంది. ఈ సర్వీస్ మార్చి 12 నుంచి ప్రారంభమవుతుంది. ప్రారంభంలో స్విగ్గీ ఈ సర్వీసును బెంగళూరు, భువనేశ్వర్, విశాఖపట్నం, విజయవాడ రైల్వే స్టేషన్లకు మాత్రమే పరిమితం చేసింది. రానున్న రోజుల్లో 59 కంటే ఎక్కువ రైల్వే స్టేషన్లకు ఈ సర్వీసును విస్తరించనున్నట్లు సమాచారం. రైళ్లలో ప్రయాణించే సమయంలో నచ్చిన ఫుడ్‌ను ప్రీ-ఆర్డర్ చేయడానికి ముందుగా ఐఆర్?సీటీసీ యాప్‌లో పీఎన్?ఆర్? నెంబర్ ఎంటర్ చేయాల్సి ఉంటుంది. తర్వాత తాము ఏ స్టేషన్‌లో అయితే ఆహారాన్ని రిసీవ్? చేసుకోవాలనుకుంటున్నారా.. ఆ రైల్వే స్టేషన్‌ను సెలెక్ట్ చేసుకోవాల్సి ఉంటుంది.

## స్పోర్ట్స్

# ఉత్కంఠ పోరులో మధ్యప్రదేశ్ చిత్తు..
# ముంబైతో అమీతుమీ తేల్చుకోనున్న విదర్భ

ఉత్కంఠగా ముగిసిన రంజీ ట్రోఫీ - 2024 తొలి సెమీఫైనల్స్‌లో మాజీ ఛాంపియన్ మధ్యప్రదేశ్‌కు ఓటమి తప్పలేదు. విదర్భతో నాగ్‌పూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో విదర్భ.. 62 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆఖరి రోజు మధ్యప్రదేశ్ విజయానికి 93 పరుగులు కావాల్సి ఉండగా విదర్భకు 4 వికెట్లు అవసరమయ్యాయి. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 228 పరుగులు చేసిన ఎంపీ.. మరో 30 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. విదర్భ బౌలర్లలో యశ్ ఠాకూర్, అక్షయ్ వఖారెలు తలా మూడు వికెట్లు పడగొట్టారు. ఆఖరి రోజు ఇరు జట్లు విజయం కోసం బరిలోకి దిగినా ఆ జట్టుకు ఆదిలోనే డబుల్ షాకులు తాకాయి. కుమార్ కార్తికేయతో పాటు అనుభవ్ అగర్వాల్‌లు డకౌట్‌లు అయ్యారు. సారాన్ష్ జైన్.. 69 బంతుల్లో 25 పరుగులు చేశాడు. చివరి వరుస బ్యాటర్ కుల్వంత్ కెజ్రోలియా (11) ను యశ్ ఠాకూర్ బౌల్డ్ చేయడంతో విదర్భ ఫైనల్ బెర్త్‌ను ఖరారుచేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో (170) విఫలమైనా విదర్భ.. రెండో ఇన్నింగ్స్‌లో 402 రన్స్ చేసింది. మధ్యప్రదేశ్.. తొలి ఇన్నింగ్స్‌లో 252 పరుగులు చేసి రెండో ఇన్నింగ్స్‌లో 258 రన్స్‌కు ఆలౌట్ అయింది. ఫైనల్‌లో విదర్భ.. 41 సార్లు రంజీ ఛాంపియన్ ముంబైతో తలపడనుంది. విదర్భకు ఇది మూడో రంజీఫైనల్. ఫైనల్ చేరిన ప్రతిసారి విదర్భ రంజీ ట్రోఫీ టైటిల్‌ను సొంతం చేసుకోవడం విశేషం




## చరిత్ర సృష్టించిన ముంబై ఇండియన్స్ స్టార్ బౌలర్



**న్యూఢిల్లీ:** ముంబై ఇండియన్స్ స్టార్ బౌలర్ షబ్‌నమ్ ఇస్మాయిల్ మహిళ క్రికెట్‌లో కొత్త చరిత్ర లిఖించింది. దక్షిణాఫ్రికాకు చెందిన ఆ బౌలర్.. అత్యంత వేగవంతమైన బంతిని వేసి రికార్డును నెలకొల్పింది. వుమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇస్మాయిల్ ఆ ఘనత సాధించింది. ఇప్పటి వరకు మహిళల క్రికెట్‌లో అత్యంత స్పీడ్ బంతి గంటకు 130 కిలోమీటర్లు మాత్రమే. కానీ మంగళవారం నాటి మ్యాచ్‌లో ఇస్మాయిల్ 132.1 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేసింది. మహిళల క్రికెట్‌లో గంటకు 130 కిలోమీటర్ల వేగం దాటడం ఇదే మొదటి సారి. ఆ బంతి మాజీ ఆసీస్ కెప్టెన్ మెగ్ లానింగ్ ప్యాడ్స్‌ను గట్టిగా ఢీకొట్టింది. సౌతాఫ్రికాతో తరపున ఇస్మాయిల్ 8 వరల్డ్‌కప్‌లు ఆడింది. ఇటీవలే ఆమె అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నది. ఓసారి విండీస్‌తో మ్యాచ్‌లో 128 కిలోమీటర్ల వేగంతో, ఆ తర్వాత 2022 వరల్డ్‌కప్‌లో 127 కిలోమీటర్ల వేగంతో ఓసారి బౌలింగ్ చేసింది. 34 ఏళ్ల ఇస్మాయిల్ 127 వన్డేలు, 113 టీ20లు ఆడింది. అంతర్జాతీయ క్రికెట్‌లో 16 ఏళ్ల పాటు ఆమె తన ట్యాలెంట్‌ను ప్రదర్శించింది. మహిళల క్రికెట్‌లో ఫాస్టెస్ట్ బౌలర్‌గా కీర్తిగాంచిన ఇస్మాయిల్.. అంతర్జాతీయ క్రికెట్‌లో 317 వికెట్లు తీసుకున్నది. టెస్టుల్లో 3, వన్డేల్లో 191, టీ20ల్లో 123 వికెట్లు తీసుకున్నది.

## ధర్మశాల టెస్టుకు జట్టును ప్రకటించిన ఇంగ్లండ్.. కీలక పేసర్ రీఎంట్రీ

భారత పర్యటనలో ఉన్న ఇంగ్లండ్ జట్టు పర్యటన ముగింపునకు వచ్చింది. ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇప్పటికే నాలుగు టెస్టులు ముగియగా.. 3 -1 తేడాతో బెన్ స్టోక్స్ సేన సిరీస్ కోల్పోయింది. ధర్మశాల వేదికగా రేపటి (మార్చి 7, గురువారం) నుంచి జరుగబోయే ఐదో టెస్టుకు గాను ఇంగ్లండ్.. తుదిజట్టును ప్రకటించింది. ఈ మ్యాచ్‌లో బెన్ స్టోక్స్ సేన ఒక మార్పుతో బరిలోకి దిగుతోంది. రాంచీలో ఆడిన ఓలీ రాబిన్సన్‌ను పక్కనబెట్టిన ఇంగ్లండ్.. మార్క్‌వుడ్‌ను జట్టులో చేర్చింది. ఈ సిరీస్‌లో మార్క్ వుడ్ పరిస్థితి మ్యూజికల్ చైర్‌లా మారింది. తొలి టెస్టులో ఆడిన వుడ్ ఒక్క వికెట్ కూడా పడగొట్టకపోవడంతో రెండో టెస్టుకు అతడిని పక్కనబెట్టింది. మళ్లీ రాజ్‌కోట్ టెస్టులో ఆడిన వుడ్.. తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. కానీ రెండో ఇన్నింగ్స్‌లో ఒక్క వికెట్ కూడా తీయలేదు. దీంతో నాలుగో టెస్టులో అతడికి విశ్రాంతినిచ్చి ఓలీ రాబిన్సన్‌ను జట్టులో చేర్చింది. రాబిన్సన్ రాంచీ టెస్టులో బ్యాటింగ్‌తో ఫర్వాలేదనిపించినా బౌలింగ్‌లో మాత్రం ఆకట్టుకోలేదు. దీంతో ఐదో టెస్టులో ఇంగ్లండ్ అతడిని పక్కనబెట్టి మళ్లీ మార్క్‌వుడ్‌కు పిలుపు అందించింది. రాంచీలో మాదిరిగానే ఇద్దరు పేసర్లు (అండర్సన్, వుడ్) ఇద్దరు స్పిన్నర్ల (హార్ట్లీ, బషీర్)లతో ఇంగ్లండ్ బరిలోకి దిగనుంది. ఇదివరకే సిరీస్ కోల్పోయిన ఇంగ్లండ్ ఈ మ్యాచ్‌లో పరువు కోసం బరిలోకి దిగనుంది. బజ్‌బాల్ ఆటతో ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులను ఆశ్చర్యపరిచిన ఆ జట్టు భారత్‌లో మాత్రం విఫలమైంది. స్పిన్‌తో పాటు బుమ్రా పేస్‌కు దాసోహైన బజ్‌బాల్.. తొలి టెస్టులో మినహా మిగిలిన మూడు టెస్టులలో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడంలో విఫలమైంది.




## 'గామి' సరికొత్త అనుభూతిని ఇస్తుంది

## - డైరెక్టర్ విద్యాధర్ కాగిత



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'గామి'. విద్యాధర్ కాగిత దర్శకత్వంలో కార్తీక్ కుల్ట్ క్రియేషన్స్‌పై కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రంలో చాందినీ చౌదరి కథానాయిక. ఈ సినిమాకు క్రౌడ్ ఫండ్ చేశారు. వి సెల్యులాయిడ్ ప్రజెంట్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్ ట్రెమండస్ రెస్పాన్స్ తో హ్యూజ్ బజ్ ని క్రియేట్ చేసింది. ఈ చిత్రం మార్చి 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు విద్యాధర్ కాగిత విలేకరుల సమావేశంలో 'గామి' విశేషాలని పంచుకున్నారు. నిజంగా జరిగిన ఓ సంఘటన నాకు చాలా ఎక్సయిట్ చేసింది. ఆ ఐడియాని రాసిపెట్టుకున్నాను. దీంతో పాటు హిమాలయాల పర్వాతాలు, మంచు, అక్కడ ప్రయాణం అంటే నాకు చాలా ఇష్టం. అలాగే విఠలాచార్య లాంటి సాహస కథలు ఇష్టం. ఇవన్నీ కలసి ఒక ఆలోచనగా మారాయి. మనకి దొరికిన బడ్జెట్ లో తీసేద్దామనే లోచనతో మొదలుపెట్టాం. క్రౌడ్ ఫండ్ కోసం ఒక పిచ్ వీడియో చేశాం. దాని ద్వారా వచ్చిన డబ్బులతో సినిమానిస్టార్ట్ చేశాం. తర్వాత డబ్బులు అవసరమైతే నిర్మాత బయట నుంచి తీసుకొచ్చారు. తర్వాత ఒక గ్లింప్స్ చూసి యూవీ క్రియేషన్స్ వారు రావడం జరిగింది. నటుల కోసం చూస్తున్నపుడు విశ్వక్ ని అనుకున్నాం. అప్పటికి తన సినిమాలు ఏవీ రాలేదు. రెగ్యులర్ గా ఒక ఆడిషన్స్ లా చేశాం. చాలా ఓపెన్ మైండ్ తో తను ఈ ప్రాజెక్ట్ ని ఎంపిక చేసుకున్నారు. నిజంగా ఆయన ధైర్యాన్ని మెచ్చుకోవాలి. చాలా పెద్ద అలోచించారు. మాకు ఒకటి కావాలి. దాని కోసం ఎంతవరకైనా చేసుకుంటూ వెళ్లాం.

## నాగచైతన్య తండేల్ కోసం భారీ సెట్



టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య నటిస్తోన్న తాజా చిత్రం తండేల్ చందూ మొండేటి డైరెక్షన్‌లో రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో వస్తున్న ఈ చిత్రంలో కోలీవుడ్ భామ సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన చేసిన తండేల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో చైతూ మాస్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు. మరోవైపు సాయిపల్లవి పోషిస్తున్న సత్య పాత్రను పరిచయం చేస్తూ.. రిలీజ్ చేసిన వీడియో ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా తండేల్ కొత్త అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇందులో చైతూ అనుకోకుండా పాకిస్థాన్ ప్రాదేశిక జలాల వెంబడి అరెస్టైన మత్స్యకారుడిగా కనిపించనున్నాడు. ఈ సీన్ల కోసం హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ ఏరియాలో భారీ పాకిస్థానీ జైలు సెట్‌ను వేస్తున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ టాక్. రాబోయే కొన్ని రోజులపాటు ఈ సన్నివేశాలు షూట్ చేయనున్నారట. తాజా షెడ్యూల్‌తో కీలక సీన్ల చిత్రీకరణ పూర్తి కానుందట. ఈ చిత్రంలో సాయిపల్లవి శ్రీకాకుళం అమ్మాయిగా కనిపించనుంది. శ్రీకాకుళం యాసలో పక్కా విలేజ్ గాళ్‌గా అలరించబోతున్నట్టు ఇన్‌సైడ్ టాక్. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మూవీ చైతూ కెరీర్‌లోనే అత్యధికంగా రూ.70 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతుందని టాలీవుడ్ సర్కిల్ టాక్. తండేల్‌కు అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. టాప్ బ్యానర్ గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

## శర్వానంద్ త్రిబుల్ బొనాంజా



టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ ఒకే రోజు వరుసగా సినిమాల అప్‌డేట్స్ ఇస్తూ మూవీ లవర్స్‌లో జోష్ నింపుతున్నాడు. ఇప్పటికే శర్వా35, శర్వా36 సినిమాలకు సంబంధించిన వార్తను షేర్ చేసి మూవీ లవర్స్‌ను ఖుషీ చేసిన శర్వానంద్.. తాజాగా శర్వా37 ప్రాజెక్టుకు సంబంధించిన ప్రకటన కూడా చేసి.. టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నాడు. సామజవరగమన ఫేం రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తాజా చిత్రాన్ని చేస్తున్నాడు శర్వానంద్. ఈ టాలెంటెడ్ హీరోకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ప్రేమ, నవ్వుల కలయికను ఇదివరకెన్నడూ లేని విధంగా సెలబ్రేట్ చేసుకునేందుకు రెడీగా ఉండండి. అద్భుతమైన ఫన్ రైడ్.. అంటూ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సరికొత్త న్యూస్‌ను అందరితో పంచుకుంది. తాజా లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. బర్త్ డే సందర్భంగా శర్వానంద్ టీం శర్వా36కు సంబంధించిన నయా అప్‌డేట్‌ను షేర్ చేసింది. ఈ మూవీ పూజా కార్యక్రమాలతో నేడు ఘనంగా ప్రారంభమైంది. అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మీ హెల్మెట్లను పట్టుకోండి.. రైడ్ వైల్డ్‌గా ఉండబోతుంది.. అంటూ క్యాప్షన్ ఇచ్చారు. మరోవైపు గూస్‌బంప్స్ తెప్పించే అడ్వెంచరస్ రైడ్‌కు సిద్ధంగా ఉండండి.. అంటూ శర్వానంద్ షేర్ చేసిన లుక్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. శర్వా36 లాంఛింగ్ స్టిల్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. శర్వానంద్ మరోవైపు శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో నటిస్తోన్న శర్వానంద్ 35 చిత్రానికి మనమే టైటిల్‌ను ఫైనల్ చేశారని తెలిసిందే. ఈ మూవీ ఫస్ట్ లుక్ నెట్టింట ట్రెండింగ్ అవుతోంది.

## కృతి సనన్ బాగా తగ్గించేసింది



హిందీలో ఎన్నో కమర్షియల్ చిత్రాల్లో నటించిన 'కృతి సనన్' టాలీవుడ్ లో కూడా మంచి గుర్తింపు తెచ్చుకుంది. మహేష్ బాబు '1 - నేనొక్కడినే' సినిమాతో పాటు, ప్రభాస్ 'ఆదిపురుష్' సినిమాలో కూడా కృతి సనన్ నటించి మెప్పించింది.ఐతే, తెలుగులో స్టార్ హీరోలతో సినిమాలు చేసినా కృతి సనన్ కి అనుకున్నంత ఫేమ్ దక్కలేదు. దీంతో, మళ్ళీ బాలీవుడ్ కే ఎగిరిపోయింది కృతి సనన్. కానీ, అక్కడ కూడా కృతి సనన్ కి ప్రస్తుతం డిమాండ్ లేకుండా పోయింది. అందుకే, తనను మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా మార్చేసిన తెలుగు ఇండస్ట్రీ పై కృతి సనన్ మళ్లీ ఫోకస్ పెట్టింది.సౌత్ స్టార్ హీరోల దృష్టి ఆటోమేటిక్ గా తన పై పడటానికి కృతి సనన్ ఇక్కడ ఓ మేనేజర్ ను కూడా పెట్టుకుంది. నిత్యం స్టార్ హీరోలతో టచ్ లోకి కూడా వెళ్తుంది అట. నిజానికి ప్యాన్ ఇండియా ఫిల్మ్ గేమ్ చేంజర్ సినిమాలో మొదట రామ్ చరణ్ తో జోడిగా కృతి సనన్ పేరే వినిపించింది. మేకర్స్ కూడా ఆమెను అప్రోచ్ అయ్యారు. మొత్తానికి గేమ్ చేంజర్ సినిమాలో కథానాయికగా తాను ఎన్నుకోబడ్డా డేట్స్ ఖాళీ లేక, ఉన్నవి సద్దుబాటు చెయ్యలేక ఆ సినిమా నుంచి కృతి సనన్ తప్పుకుంది. మొత్తమ్మీద హిందీలో తనకు డిమాండ్ తగ్గుతున్న నేపథ్యంలో కృతి సనన్ సౌత్ పై మమకారం చూపించే ప్రయత్నం చేస్తోంది. ప్రస్తుతం అమ్మడు తెలుగు కూడా నేర్చుకునే పనిలో ఉందట. పైగా రెమ్యునరేషన్ ను కూడా తగ్గించుకోబోతుంది. ఇప్పటివరకు హిందీలో మూడు నుంచి నాలుగు కోట్లు తీసుకుంటున్న కృతి సనన్, సౌత్ సినిమాల కోసం 2 కోట్లు మాత్రమే డిమాండ్ చేస్తుందట.



## పుష్ప 3 రిలీజ్ అయ్యేది అప్పుడే

ప్రస్తుతం తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఎక్కువగా వినిపిస్తున్న పేర్లలో పుష్ప సినిమా పేరు కూడా ఒకటి. సుకుమార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో విడుదలైన పుష్ప పార్ట్ 1 సినిమా ఎంతటి విజయాన్ని సాధించిందో మనందరికీ తెలిసిందే. ప్రస్తుతం పుష్ప 2 సినిమా షూటింగ్ జరుగుతోంది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే పుష్ప 2 సినిమా ఇంకా విడుదల కాకముందే పుష్ప 3 కి సంబంధించి వార్తలు జోరుగా వినిపిస్తున్న విషయం తెలిసిందే. గత రెండు మూడు వారాలుగా ఈ సినిమాకు సంబంధించిన వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. కాగా మూడేళ్ల క్రితం వచ్చిన పుష్ప మూవీకి రెండో పార్ట్ గా ఈ మూవీ రాబోతుంది. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. ఇంకా షూటింగ్ కూడా పూర్తి కాలేదు. కానీ ఈ సినిమాకి సంబంధించిన ఒక క్రేజ్ న్యూస్ మాత్రం సోషల్ మీడియాని ఊపేస్తుంది. పుష్ప 2 కి మరో సీక్వెల్ ఉంటుందనే ప్రచారం చాలా రోజులుగా జరుగుతుంది. ఆ మధ్య ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ అల్లు అర్జున్.. ఈ విషయాన్ని స్పష్టం చేశారు. పుష్ప 3 ఉండొచ్చు, ఇంకా చాలా పార్ట్ లు కూడా చేయవచ్చు అని అంటూనే మూడో పార్ట్ ఉంటుందని చెప్పకనే చెప్పారు. ఈ నేపథ్యంలో దీనికి సంబంధించిన ఇంట్రెస్టింగ్ న్యూస్ నెట్టింట చక్కర్లు కొడుతుంది. లేటెస్ట్ సమాచారం ప్రకారం.. పుష్ప 3 కూడా ఉండబోతోందట. అల్లు అర్జున్, సుకుమార్ మూడో పార్ట్ తీయాలని ఫిక్స్ అయ్యారు. పుష్ప 2 కి సంబంధించిన కంటెంట్ చూసుకున్నాక, పార్ట్ 3 కచ్చితంగా అవసరం అని భావించారట. దీంతో పుష్ప 3 ని కూడా తెరకెక్కించాలని భావిస్తున్నారట. అంతేకాదు ఔట్‌పుట్ చూసుకున్నాక ఈ మూవీని కచ్చితంగా ఆగస్ట్ 15కి విడుదల చేయాని నిర్ణయించుకున్నారట. డేట్‌ని మార్చేది లేదని ఫిక్స్ అయ్యారట. మరోవైపు ఆ మూవీ విడుదలైన వెంటనే షూటింగ్ చేయనున్నారట.పుష్ప తో పాటే మూడో పార్ట్ కి సంబంధించిన మేజర్‌పోర్షన్ సీన్లు చిత్రీకరిస్తారట.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL 00067, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com